స్వాగత కార్యక్రమంలో జస్టిస్ ఎంఎం శ్రీవాస్తవ



రాజ్యాంగానికి కట్టుబడి
సేవకుడిలా పనిచేస్తా

హైకోర్టు చీఫ్ జస్టిస్ ఎంఎం శ్రీవాస్తవ

చెన్నై, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ ధర్మాసనానికి కట్టుబడి సేవకుడిలా పనిచేస్తానని మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎంఎం శ్రీవాస్తవ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం రాజ్‌భవన్‌లో హైకోర్టు సీజేగా ప్రమాణస్వీకారం చేసిన జస్టిస్ శ్రీవాస్తవ మంగళవారం ఉదయం హైకోర్టులో బాధ్యతలు స్వీకరించారు. ముందుగా హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది ఆయనకు ఘనస్వాగతం పలికి సత్కరించారు. ఈ సత్కారసభలో హైకోర్టు న్యాయమూర్తులు, ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ పీఎస్ రామన్, అదనపు సొలిసిటర్ జనరల్ ఎఆర్ఎల్ సుందరేశన్ తదితరులు పాల్గొన్నారు. చీఫ్ జస్టిస్ శ్రీవాస్తవను రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ పీఎస్ రామన్, తమిళనాడు బార్ కౌన్సిల్ ఛైర్మన్ పీఎస్ అమల్‌రాజ్, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జి.మోహన్ కృష్ణన్, మద్రాస్ బార్ అసోసియేషన్ ఛైర్మన్ భాస్కర్, మహిళా న్యాయవాదుల సంఘం అధ్యక్షురాలు ఎస్ఎస్ రేవతి, లా అసోసియేషన్ అధ్యక్షుడు సెల్వరాజ్ తదితరులు సన్మానించారు. ఆలిండియా బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.ప్రభాకరన్, న్యాయవాదుల సంఘం కార్యదర్శి ఆర్.కృష్ణకుమార్, ఉపాధ్యక్షుడు అరివళగన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ శ్రీవాస్తవ మాట్లాడుతూ.. దేశంలోనే అత్యంత ప్రాచీనమైన, గర్వించదగిన సంప్రదాయం కలిగిన మద్రాసు హైకోర్టులో సేవ చేసే అవకాశం కలిగినందుకు తానెంతో గర్వపడుతున్నానన్నారు. మద్రాసు హైకోర్టు స్వతంత్ర్య న్యాయవ్యవస్థగా పేరొందిందని, ధైర్యవంతులైన న్యాయమూర్తులు, న్యాయవాదులను అందించిన ఘనత ఈ న్యాయస్థానానికే దక్కుతుందన్నారు. రాజ్యాంగ ధర్మాసనానికి కట్టుబడి ఈ న్యాయస్థానంలో తన వంతు సేవలందిస్తానని, అంకిత భావంతో తానొక సేవకుడిగానే పనిచేస్తానని సభికుల హర్షధ్వానాల నడుమ ప్రకటించారు. అనంతరం హైకోర్టు నుంచి బదిలీ అయిన జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ వివేక్ కుమార్‌సింగ్‌లకు తోటి న్యాయమూర్తులు, న్యాయవాదులు ఘనంగా వీడ్కోలు పలికారు.

ఆగని శ్రీలంక నావికాదళం ఆగడాలు

- నలుగురు రామేశ్వరం జాలర్ల అరెస్టు

టి.నగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తమ దేశ సముద్ర జలాల్లోకి అక్రమంగా చొరబడ్డారని ఆరోపిస్తూ శ్రీలంక నావికాదళం తమిళ జాలర్లపై దాడులు చేయడం ఆనవాయితీగా మారింది. తాజాగా సముద్రంలో చేపలు పడుతున్న నలుగురు రామేశ్వరం జాలర్లను నిర్బంధించి, వారి పడవలో ఉన్న వలలు, జీపీఎస్ పరికరాలు, మత్స్య సంపదను కూడా స్వాధీనం చేసుకుంది. రామేశ్వరానికి చెందిన నలుగురు జాలర్లు మరపడవలో సముద్రంలో చేపలవేటకు వెళ్లారు. మంగళవారం వేకువజాము నెడుదీవికి సమీపంలో చేపలు పడుతుండగా గస్తీనౌకలో వచ్చిన శ్రీలంక నావికాదళం వారిని చుట్టుముట్టి అరెస్టు చేశారు. మరపడవ సహా జాలర్లను మన్నార్ శిబిరానికి తరలించారు. ప్రస్తుతం అరెస్టయిన నలుగురు జాలర్లను విచారిస్తున్నట్టు శ్రీలంక ప్రభుత్వం ఓ ప్రకటన జారీచేసింది.



ఆస్పత్రి నుంచే సీఎం విధులు

పథకాల అమలుపై స్టాలిన్ సమీక్ష

చెన్నై, జూలై 22 (ఆంధ్రజ్యోతి): స్వల్ప అస్వస్థతకు గురై అపోలో ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో వున్న ముఖ్యమంత్రి స్టాలిన్ మంగళవారం ఉదయం అక్కడి నుండే ప్రభుత్వ విధులను నిర్వర్తించారు. రాష్ట్ర వ్యాప్తంగా 'ఉంగలుడన్ స్టాలిన్' పథకం అమలుపై అధికారులతో సమీక్ష జరిపారు. సోమవారం ఉదయం వాకింగ్‌కు వెళుతూ స్టాలిన్ స్వల్ప అస్వస్థతకు గురవగా, అపోలో ఆస్పత్రికి తరలించిన విషయం తెలిసిందే. బుధవారం వరకు ఆయన ఆస్పత్రిలోనే చికిత్స పొందుతారని తెలిసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం మధ్యాహ్నం ఓ ప్రకటన విడుదల చేసింది. అందులో అపోలో ఆస్పత్రిలో స్టాలిన్ మూడు రోజులపాటు విశ్రాంతి తీసుకుంటారని, అదే సమయంలో ఆస్పత్రి నుంచే విధులు నిర్వర్తిస్తారని పేర్కొంది. మంగళవారం ఉదయం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, ఇతర అధికారులు ఆయనతో భేటీ అయ్యారు. ఆ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్న 'ఉంగలుడన్ స్టాలిన్' పథకానికి వస్తున్న ప్రజాస్పందన తెలుసుకున్నారు.

త్వరలోనే డిశ్చార్జ్...

ముఖ్యమంత్రి స్టాలిన్‌కు అపోలో ఆస్పత్రిలో మంగళవారం ఉదయం కొన్ని వైద్య పరీక్షలు జరిగాయని, ఆయన ఆరోగ్య పరిస్థితి సంతృప్తికరంగానే ఉందని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తెలిపారు. నగరంలో పాఠశాల విద్యార్థులకు సహాయాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ ఆరోగ్యంగానే ఉన్నారని వైద్యుల పర్యవేక్షణలోనే ఆయన మూడు రోజులపాటు విశ్రాంతి తీసుకుంటారని చెప్పారు. ఆ తర్వాత మునుపటిలా స్టాలిన్ ఉత్సాహంగా ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేయటంపై తానెలాంటి వ్యాఖ్యలు చేయదలచుకోలేదన్నారు.

రాష్ట్రమంతటా మరిన్ని శిబిరాలు ఏర్పాటు చేసిన ప్రజల నుండి వినతిపత్రాలు స్వీకరించి 45 రోజుల్లోగా ఆయా శాఖలకు చెందిన అధికారులు వాటిపై చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

అళగిరి పరామర్శ...

అపోలో ఆస్పత్రిలో ఉన్న ముఖ్యమంత్రి స్టాలిన్‌ను ఆయన సోదరుడు ఎంకే అళగిరి పరామర్శించారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ఆయన అపోలో ఆస్పత్రికి వెళ్ళారు. స్టాలిన్‌ను కలిసి ఆయన ఆరోగ్యం గురించి అక్కడి వైద్యులనడిగి తెలుసుకున్నారు. అళగిరి ఇటీవల సోదరుడు ఎంకే ముత్తు మృతి సందర్భంగా నివాళులర్పించేందుకు మదురై నుంచి వచ్చారు. మూడు రోజులుగా అళగిరి నగరంలోనే ఉన్నారు. సోమవారం ఉదయం వైద్యపరీక్షలు పూర్తి చేసుకుని సాయంత్రానికి స్టాలిన్ ఇంటికి చేరుకుంటారని అళగిరి భావించారు. అయితే మూడురోజులపాటు అపోలో ఆసుపత్రిలోనే ఉంటారని ప్రభుత్వం ప్రకటించిన వెంటనే అళగిరి అపోలో ఆస్పత్రికి వెళ్ళి స్టాలిన్‌ను పరామర్శించారు. ఇదే విధంగా మంత్రులు కేఎన్ నెహ్రూ, మాజీ మంత్రి పొన్ముడి తదితరులు స్టాలిన్‌ను కలుసుకుని ఆయన ఆరోగ్యం గురించి వాకబు చేశారు.



తూత్తుకుడి ఎయిర్‌పోర్ట్‌లో కొత్తగా నిర్మించిన ఎంట్రన్స్

ఒక రోజు ముందే
రాష్ట్రానికి ప్రధాని

- 26న తూత్తుకుడి ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవం

చెన్నై, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనలో స్వల్ప మార్పులు జరిగాయి. ఈ నెల 27, 28 తేదీల్లో ఆయన అరియలూరు, తూత్తుకుడి జిల్లాల్లో పర్యటించాల్సి వుండగా, తాజాగా వెలువడిన షెడ్యూలు ప్రకారం ఆయన ఒక రోజు ముందే రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఆ ప్రకారం ఈ నెల 26 రాత్రి ఆయన అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దిన తూత్తుకుడి విమానాశ్రయాన్ని ప్రారంభించనున్నారు. తూత్తుకుడి విమానాశ్రయంలో రూ.380 కోట్లతో పునర్నిర్మాణ పనులు జరిగాయి. అంతర్జాతీయ స్థాయి సదుపాయాలతో రూపుదిద్దుకున్న ఈ విమానాశ్రయంలో ప్రస్తుతం రాత్రిపూట కూడా విమానాలు ల్యాండింగ్, టేకాఫ్ సదుపాయం ఉంది. 1350 మీటర్ల పొడవైన రన్‌వేను ప్రస్తుతం 3 వేల మీటర్లకు పెంచారు. అంతే కాకుండా ఒకే సమయంలో ఐదు విమానాలను నిలిపే వీలు ఒటుంది. ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించిన తర్వాత ప్రధాని మోదీ రూ.2357 కోట్లతో నిర్మించిన సేత్తియాతోప్పు- చోళపురం ప్రాంతంలో ఫోర్‌వే ప్రాజెక్టు, రూ.200 కోట్లతో సిక్స్‌వేగా మార్చిన తూత్తుకుడి హార్బర్ రోడ్డును,, రూ.99 కోట్లతో నిర్మించిన మదురై -బోడినాయకనూర్ మధ్య రైలుమార్గం విద్యుదీకరణ ప్రాజెక్టు, రూ.65-0 కోట్లతో నాగర్‌కోవిల్ టౌన్ - నాగర్‌కోవిల్ జంక్షన్ - కన్నియాకుమారి జంక్షన్ మధ్య రైలు మార్గం డబ్లింగ్ ప్రాజెక్టు సహా పూర్తయిన ప్రాజెక్టులను ఆయన జాతికి అంకితం చేయనున్నారు. తూత్తుకుడి కార్యక్రమాలు అనంతరం మోదీ అక్కడి నుండి రాత్రి 9.30 గంటలకు విమానంలో బయలుదేరి తిరుచ్చి చేరుకుంటారు. మరుసటి రోజు 27వ తేదీ ఉదయం ఆయన తిరుచ్చి నుండి అరియలూరు జిల్లా గంగైకొండచోళపురానికి వెళతారు. అక్కడి ఆలయంలో రాజేంద్ర చోళుడి జయంత్యుత్సవాల్లో పాల్గొంటారు.

కోలీవుడ్‌లో
కొకైన్ కలకలం!

- కేసు నుంచి నటీనటులను తప్పించేందుకు రూ.50 లక్షల లంచం
- డ్రగ్ సప్లయర్ ప్రదీప్ కుమార్ వాంగ్మూలం
- వీఆర్‌కు సీఐ, ఇద్దరు ఎస్ఐలు

అడయార్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తమ దగ్గర కొకైన్ వంటి మాదకద్రవ్యాలను కొనుగోలు చేసిన నటులను అరెస్టు చేయకుండా ఉండేందుకు కొందరు పోలీసులు రూ.50 లక్షల మేరకు లంచం తీసుకున్నట్టు డ్రగ్ సప్లయర్ ప్రదీప్ కుమార్ వాంగ్మూలం ఇచ్చాడు. దీనిపై లోతైన దర్యాప్తు చేపట్టిన ఉన్నతాధికారులు.. క్రైమ్ బ్రాంచ్ స్పెషల్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఎస్ఐలపై చర్యలు తీసుకున్నారు. ఈ ముగ్గురినీ వీఆర్‌కు పంపించారు. మే 22న నుంగంబాక్కంలోని ఓ హోటల్‌లో రెండు గ్రూపుల మధ్య గొడవ జరగ్గా, దీనికి సంబంధించి నుంగంబాక్కం పోలీసులు అన్నాడీఎంకే నేత ప్రసాద్, ఈసీఆర్ రాజా, అజయ్ వాండయార్, రౌడీ సునామీ సేతు సహా మొత్తం 9 మందిని అరెస్టు చేశారు. ఈ గొడవకు కారణాలపై పోలీసులు లోతుగా ఆరా తీయగా, ఇందులో సేలంకు చెందిన ప్రదీప్ కుమార్ అలియాస్ బ్రిట్టో (38) వద్ద అధిక మొత్తంలో కొకైన్ కొనుగోలు చేసి నటుడు శ్రీకాంత్, శ్రీకృష్ణలకు సరఫరా చేసినట్టు ప్రసాద్ వెల్లడించాడు. ఆ తర్వాత ప్రదీప్ కుమార్ సహా ఆఫ్రికాకు చెందిన జాన్ (38)ను జూన్ 17న అరెస్టు చేశారు. వారిచ్చిన సమాచారం మేరకు హీరో శ్రీరామ్, శ్రీకృష్ణలను అరెస్టు చేయగా, ఆ తర్వాత వీరిద్దరు బెయిల్‌పై విడుదలయ్యారు. అయితే ఈ కేసులో లోతుగా విచారణ జరిపేందుకు ట్రిప్లికేన్ క్రైమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్, థౌజండ్‌లైట్ పోలీస్ స్టేషన్‌లో పనిచేసే ఇద్దరు ఎస్ఐలను ఉన్నతాధికారులు ఎంపిక చేశారు. ఈ బృందం ప్రసాద్, జాన్‌లను కస్టడీలోకి తీసుకుని విచారించగా, అనేక మంది సినీ ప్రముఖులకు డ్రగ్స్ సరఫరా చేసినట్టు వెల్లడించారు. వారిచ్చిన సమాచారం మేరకు మరో 26 మందిని అరెస్టు చేశారు. అలాగే, ప్రదీప్ కుమార్, నైజీరియాకు చెందిన సారా కొవమామాను కస్టడీలోకి తీసుకుని, వారిని ప్రశ్నించారు. దీంతో నటీనటులకు డ్రగ్స్ సరఫరా చేసేందుకు విరుగంబాక్కంకు చెందన జెస్వీర్ అలియాస్ కెవిన్ అనే వ్యక్తిని సహాకుడిగా నియమించుకున్నట్టు వారు పోలీసులకు చెప్పారు. అతడి ద్వారా శ్రీరామ్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులకు మాదక ద్రవ్యాలు సరఫరా చేసినట్టు వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తమను అరెస్టు చేయకుండా ఉండేందుకు పలువురు నటీనటులు ప్రదీప్ కుమార్‌కు రూ.50 లక్షల వరకు ఇవ్వగా, వాటిని పోలీసులకు అందజేశారు. దీంతో ప్రత్యేక బృందం పోలీసులు ప్రదీప్ కుమార్‌ను నామమాత్రంగా విచారణ జరిపి చేతులు దులుపుకున్నట్టు ఉన్నతాధికారులు గుర్తించారు. పైగా ఈ అంశంపై మరింత లోతుగా డిప్యూటీ కమిషనర్ విచారణ జరుపుతున్నారు. అదేసమయంలో లంచం తీసుకున్నట్టు ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో సీఐ, ఇద్దరు ఎస్ఐలను వీఆర్‌కు పంపించారు. అలాగే, ఈ కేసు నుంచి తప్పించుకున్న నటీనటులు ఎవరనే అంశంపై ఆరా తీస్తున్నారు.



సత్య

మాజీ ఎమ్మెల్యేపై
అక్రమార్జన కేసు

- ఆదాయానికి మించి రూ.9.79 కోట్ల ఆస్తులు

అడయార్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా బన్రూట్టి మాజీ ఎమ్మెల్యే, అన్నాడీఎంకే నేత సత్యపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు నమోదు చేసింది. ఆదాయానికి మించి రూ.9.79 కోట్ల మేరకు ఆస్తులు సంపాదించారన్న ఆరోపణలపై ఆమెపై ఈ కేసు నమోదైంది. ఈ నెల 18వ తేదీ ఉదయం 6 గంటలకు ఆమె నివాసం సహా కార్యాలయాల్లో ఏసీబీఅఅ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఏసీబీ డీఎస్పీ సత్యరాజ్ సారథ్యంలోని 15 మంది బృందం 17 గంటలపాటు సుదీర్ఘంగా తనిఖీలు చేశారు. 2016లో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సత్య, ఆమె భర్త పన్నీర్‌సెల్వం బన్రూట్టి నగర చైర్మన్‌గా ఉన్నపుడు అక్రమంగా ఆస్తులు సంపాదించినట్టు గుర్తించారు. దీంతో సత్య, ఆమె భర్త పన్నీర్ సెల్వం సహా మరో ఇద్దరిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. 2016 నుంచి 2021 వరకు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆదాయానికి మంచి 571.30 శాతం మేర ఆస్తులు సంపాదించినట్టు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.

బ్లూఫ్లాగ్ ప్రమాణాలతో మెరీనాబీచ్‌కు నూతన సొబగులు

7

లయోలా కాలేజీలో ఉద్యోగ నియామకాలను
ఆమోదించండి

- ప్రభుత్వానికి హైకోర్టు ఉత్తర్వు

టి.నగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులకు సంబంధించిన సమాచారం తెలుపలేదన్న కారణంతో లయోలా కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి అంగీకారం తెలుపకపోవటం గర్హనీయమంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు మందలించింది. ఆ కళాశాలలో ఖాళీగా ఉన్న 18 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి ఆమోదం తెలుపాలని ఉత్తర్వు జారీ చేసింది. నగరంలోని లయోలా కళాశాలలో 18 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, లైబ్రేరియన్ పోస్టుల్లో అభ్యర్థులను నియమించడాన్ని నిరాకరిస్తూ కళాశాలల విద్యావిభాగం సంయుక్త సంచాలకులు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని, ఖాళీగా ఉన్న 19 పోస్టులలో నియామకాలకు అనుమతివ్వాలని ఆ కళాశాల యాజమాన్యం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ న్యాయమూర్తి సి. కుమరప్పన్ ఎదుట విచారణకు రాగా కళాశాలకు 149 బోధనాపరమైన ఉద్యోగాలు, 59 బోధనేతర ఉద్యోగాలు మంజూరయ్యాయని, ప్రస్తుతం ఖాళీగా ఉన్న పోస్టులకు భర్తీ చేసుకునే హక్కు కళాశాల యాజమాన్యానికి ఉందని లయోలా కళాశాల తరఫున వాదించిన సీనియర్ న్యాయవాది ఐజాక్ మోహన్‌లాల్ పేర్కొన్నారు. కాగా 1999-2000లో కళాశాలకు మంజూరు చేసిన పోస్టుల వివరాలు, 1999 నుంచి పనిచేస్తున్న ప్రొఫెసర్ల వివరాలు, నియామకాలకు సంబంధించి కళాశాల కమిటీ తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన వివరాలను సమర్పించకపోవడం వల్లే తాజా పోస్టుల భర్తీ, నియామకాలకు ప్రభుత్వం ఆమోదం తెలుపలేదని ప్రభుత్వం తరఫు న్యాయవాది జయప్రకాష్ పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదప్రతివాదనల అనంతరం న్యాయమూర్తి సి.కుమరప్పన్ మాట్లాడుతూ మైనారిటీ కళాశాలల్లో నియమితులయ్యే ప్రొఫెసర్ల విద్యార్హత నిర్ధారించే అధికారం మాత్రమే రాష్ట్రప్రభుత్వానికి ఉందని, అలాంటప్పుడు భర్తీ చేయనున్న పోస్టుల (ఉద్యోగాల) వివరాలను సమర్పించలేదనే కారణంగా ప్రొఫెసర్ల నియామకానికి ఆమోదం తెలుపకపోవడం గర్హనీయమన్నారు. ఈ విషయంలో 19 ఉద్యోగాలకు సంబంధించిన నియామకాలను నిరాకరిస్తూ కళాశాలల విద్యావిభాగం సంయుక్త సంచాలకులు జారీ చేసిన ఉత్తర్వును రద్దు చేశారు. అంతేకాకుండా గత మూడునెలల్లో లయోలా కళాశాలలో జరిగిన 19 నియామకాలకు ఆమోదం ప్రకటించాలని కళాశాలల విద్యావిభాగం సంయుక్త సంచాలకులకు న్యాయమూర్తి ఉత్తర్వు జారీ చేశారు.



భారీగా తరలివచ్చిన జనం



ప్రసంగిస్తున్న ఈపీఎస్

కలిసి పోటీ చేద్దాం రండి

- విజయ్, సీమాన్‌లకు ఈపీఎస్ ఆహ్వానం
- బీజేపీ మింగేయడానికి అన్నాడీఎంకే ఏమైనా కీటకమా ?

ప్యారీస్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన డీఎంకేను గద్దె దించేందుకు కలిసి పోటీ చేసేందుకు ముందుకు రావాలని తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్, నామ్ తమిళర్ కట్చి (ఎన్‌టీకే) అధినేత సీమాన్‌లకు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పిలుపునిచ్చారు. 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీడ్పోం' అనే నినాదంతో ఈ నెల 7 నుంచి ఈపీఎస్ చేపట్టిన తొలి విడత ఎన్నికల ప్రచారయాత్ర మంగళవారం తంజావూరు జిల్లా కుంభకోణం చేరుకుంది. అక్కడ నేత కార్మికులతో సమావేశమైన ఆయన వారు ఎదుర్కొంటున్న సమస్యలపై అందించిన వినతిపత్రాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా నేత కార్మికులతో ఈపీఎస్ మాట్లాడుతూ... అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో మరమగ్గాల అభివృద్ధికి పలు పథకాలు అమలుపరిచినట్లు గుర్తుచేశారు. ఈ సమావేశం అనంతరం మీడియాతో ఈపీఎస్ మాట్లాడుతూ, అమలుకు సాధ్యంకాని హామీలతో ప్రజలను 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నమ్మించి అధికారంలోకి వచ్చిన డీఎంకే ఇచ్చిన మాట నిలబెట్టుకోలేకపోయిందని, డీఎంకే ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్న ప్రజలు అన్నాడీఎంకేను గెలిపించేందుకు ఎదురుచూస్తున్నారని, ప్రజల అవసరాలను తమ పార్టీ తప్పకుండా తీరుస్తుందన్నారు. డీఎంకేను ఇంటికి సాగనంపేందుకు పలు పార్టీలు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయని, ఏకాభిప్రాయం గల పార్టీలు తమ కూటమిలోకి రావాలని, విజయ్, సీమాన్ కూడా తమతో చేతులు కలపాలని ఈపీఎస్ పిలుపునిచ్చారు. 1999లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 2001లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కూటమిలో అన్నాడీఎంకే, మరికొన్ని ప్రాంతీయ పార్టీలు ఉన్న విషయాన్ని ఈపీఎస్ గుర్తుచేశారు. ఆ కూటమిలోవున్న పార్టీలు బీజేపీతో పొత్తుకుదుర్చుకున్న అన్నాడీఎంకేను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యకర్తల బలం, ప్రజల అండదండలతో మళ్ళీ అధికారంలోకి రాబోయేది తామేనని, రాష్ట్రప్రజలు సింగిల్ పార్టీ పాలననే కోరుకుంటున్నారని, ఈ విషయంలో అన్నాడీఎంకే తీసుకున్న నిర్ణయంలో ఎలాంటి మార్పు ఉండబోదని ఆయన స్పష్టం చేశారు.

మింగేయడానికి మేమేమైనా పురుగులమా?..

తిరుత్తురైపూండి బహిరంగ సభలో తాను మాట్లాడిన తర్వాతే డీఎంకే కూటమిలో వున్న పలువురు నేతలు భయపడుతున్నారని ఈపీఎస్ పేర్కొన్నారు. అన్నాడీఎంకేను బీజేపీ మింగుతుందని డీఎంకే నేతలు హేళన చేస్తున్నారని, కమలం పార్టీ మింగేందుకు తాము పురుగులం కాదన్నారు. ఎన్నికలకు మరో ఎనిమిది నెలలే సమయం ఉందని, రాబోయే రోజుల్లో తమ నేతృత్వంలోనే బలమైన కూటమి ఏర్పడుతుందన్నారు. తాను పాల్గొంటున్న సభలకు కూటమి పార్టీల కార్యకర్తలే కాకుండా రైతులు, మత్స్యకారులు, కూలీ కార్మికులు, మహిళలు పెద్దసంఖ్యలో వస్తున్నారని, ఇది చూసి ఓర్వలేక డీఎంకే కూటమి నేతలు ప్రజలను మభ్యపెట్టేలా అన్నాడీఎంకేపై చలోక్తులు విసురుతున్నారని ఈపీఎస్ ఆరోపించారు.

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

టి.నగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో బుధవారం ఉదయం నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రాంతాల వివరాలిలా వున్నాయి... **తరమణి:** వీహెచ్ఎస్ హాస్పిటల్, సర్దార్ పటేల్ రోడ్డు, తరమణి, శ్రీరామ్‌నగర్ 1 నుంచి 4వ వీధి వరకు, పళ్ళిపేట్టై, శ్రీరామ్‌నగర్ మెయిన్‌రోడ్డు, భజనకోవిల్ వీధి, యోగితోట్టమ్, న్యూ స్ట్రీట్, కందసామి వీధి పరిసర ప్రాంతాలు. **సిరుచేరి :** సిరుచేరి సిప్కాట్ నావలూరు, తాళంబూరు ప్రాంతం, సిరుచేరి, కారణై గ్రామం, ఏకాట్టూర్, ఓఎమ్మార్ నావలూరు, పడుపాక్కం, ఎళిల్‌ముగ నగర్, జవహర్‌నగర్, గాంధీనగర్, ఒలంపియా, సంధ్యాగార్డెన్ పరిసర ప్రాంతాలు.

అవసరమైన ప్రాంతాల్లో కొత్త రేషన్ దుకాణాలు

ప్యారీస్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అవసరమైన ప్రాంతాల్లో కొత్త రేషన్ దుకాణాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి చక్రపాణి పేర్కొన్నారు. పౌరసరఫరాలశాఖ కార్యాలయంలో రేషన్ కార్డుదారులకు నిత్యవసర సరుకుల పంపిణీ, వాటి నాణ్యత, రేషన్ దుకాణంలో కల్పించిన వసతులు తదితరాలపై మంత్రి ఆ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశం అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ, కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారికి పంపిణీ చేయాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ఇప్పటివరకు చౌకదుకాణాలులేని ప్రాంతాల్లో అవసరమున్న చోట కొత్త, పార్ట్ టైమ్ రేషన్ దుకాణాలను త్వరలో ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు.

రామేశ్వరంలో విమానాశ్రయం

ప్యారీస్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లాలో ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా విరజిల్లుతున్న రామేశ్వరంలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలన్న భక్తులు, పర్యాటకుల కల నెరవేరనుంది. రామేశ్వరం పుణ్యక్షేత్రానికి ప్రతిరోజు భక్తులు, పర్యాటకులు పెద్దసంఖ్యలో వస్తుంటారు.ఈప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని జిల్లా యంత్రాంగానికి పలుమార్లు విజ్ఞప్తి చేశారు. దానిని పరిశీలించిన రాష్ట్రప్రభుత్వం పర్యాటకుల కల నెరవేర్చనుందని మంత్రి తంగం తెన్నరసు ఇటీవల మీడియాకు తెలిపారు. ఈ నేపథ్యంలో, రామేశ్వరం ప్రాంతంలో విమానాశ్రయం నిర్మించేందుకు అనువైన స్థల ఎంపిక ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. ఎంపిక చేయనున్న ఐదు ప్రాంతాలను పరిశీలించి హైటెక్ వసతులతో ఓ ప్రాంతంలో విమానాశ్రయం నిర్మించే పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

అరూర్-సేలం మార్గంలో కొత్త టోల్‌గేట్ ప్రారంభం

ప్యారీస్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి, కృష్ణగిరి జిల్లాల మధ్య అరూర్-సేలం జాతీయ రహదారిలో హెచ్.పుదుపట్టిలో ఏర్పాటు చేసిన కొత్త టోల్‌గేట్ ప్రారంభమైంది.. తిరుపత్తూరు జిల్లా వాణియంబాడి నుంచి సేలం వరకు గల జాతీయ రహదారిలో, కృష్ణగిరి జిల్లా ఊతంగిరి నుంచి, ధర్మపురి జిల్లా ఏ.పళ్ళిపట్టు వరకు రూ.320 కోట్లతో 86 కిలోమీటర్ల మేర ఫోర్ లేన్ రోడ్డు నిర్మించారు. ఇందులో ఊతంగిరి బస్టాండ్ నుంచి ఏ.పళ్ళిపట్టు వరకు గల 44 కిలోమీటర్ల దూరంలోని అరూర్-సేలం రహదారిలో హెచ్.పుదుపట్టిలో ప్రారంభించిన టోల్‌ప్లాజాలో వాహనచోదకుల నుంచి టోల్‌పన్ను వసూలు చేస్తున్నారు.

బ్యూటీ పార్లర్ల శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్యారీస్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బ్యూటీ పార్లర్ల శిక్షణకు ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన యువత నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు థాడ్కో ప్రకటించింది. 8, ప్లస్‌టూ ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 35యేళ్లలోపు ఎస్సీ, ఎస్టీ వర్గాల యువత బ్యూటీ పార్లర్, శిరోజాలంకరణ శిక్షణలో చేరవచ్చని తమిళనాడు ఆది ద్రావిడ హౌసింగ్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. మరిన్ని వివరాలకు www.tahdco.com అనే వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

గుమ్మిడిపూండి-కవరైపేట మధ్య రైళ్ల వేళల్లో మార్పులు

ప్యారీస్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి-కవరైపేట మధ్య మరమ్మతుల కారణంగా 17 సబర్బన్ విద్యుత్ రైళ్ల సేవలు మార్పు చేసినట్లు దక్షిణ రైల్వే మంగళవారం ప్రకటించింది. వివరాలిలా... చెన్నై సెంట్రల్ నుంచి గుమ్మిడిపూండికి వచ్చే గురువారం మధ్యాహ్నం 11.35, 1.40, 3.05 గంటలకు బయలుదేరాల్సిన సబర్బన్ విద్యుత్ రైళ్లను రద్దుచేశారు. అలాగే సెంట్రల్ నుంచి సూళ్లూరుపేటకు అదేరోజు ఉదయం 10.15, మధ్యాహ్నం 12.10 గంటలకు నడపాల్సిన రైళ్లు, సూళ్లూరుపేట నుంచి సెంట్రల్‌కు మధ్యాహ్నం 1.15, 3.15 గంటలకు నడపాల్సిన రైళ్లను రద్దుచేశారు. చెన్నై బీచ్, గుమ్మిడిపూండి మార్గంలో అదేరోజు మధ్యాహ్నం 12.40, 2.40, 3.45 గంటలకు నడపాల్సిన విద్యుత్ రైళ్లు, గుమ్మిడిపూండి నుంచి బీచ్‌కి సాయంత్రం 4.30 గంటలకు నడపాల్సిన రైలు, గుమ్మిడిపూండి నుంచి సెంట్రల్‌కు మధ్యాహ్నం 2.30, 3.45 గంటలకు నడపాల్సిన రైళ్లను రద్దుచేశారు. చెంగల్పట్టు నుంచి ఉదయం 9.55 గంటలకు గుమ్మిడిపూండికు బయలుదేరాల్సిన విద్యుత్ రైలు, మింజూరు, గుమ్మిడిపూండిల మధ్య పాక్షికంగా రద్దుచేయనున్నట్లు ప్రకటించారు. అదేరోజు గుమ్మిడిపూండి నుంచి సెంట్రల్‌కు 23, 24వ తేదీల్లో మధ్యాహ్నం 1, 2.30, 3.45 గంటలకు నడపాల్సిన రైళ్లను రద్దుచేశారు. కాగా, రద్దయ్యే విద్యుత్ రైళ్లకు ప్రత్యామ్నాయంగా అదేరోజు సెంట్రల్, బీచ్ స్టేషన్ల నుంచి పొన్నేరి మధ్య ప్రత్యేక రైళ్లసేవలు అందుబాటులో ఉంటాయి. అంతేకాకుండా గుమ్మిడిపూండి-చెన్నై, సూళ్లూరుపేట-చెన్నై మధ్య ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ రైల్వే శాఖ తన ప్రకటనలో తెలిపింది.

ఎయిర్‌పోర్టులో త్వరలో ప్రీపెయిడ్ టాక్సీ ఆన్‌లైన్స్ బుకింగ్స్

అడయార్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): చెన్నై విమానాశ్రయంలో త్వరలో ప్రీపెయిడ్ టాక్సీ ఆన్‌లైన్ బుకింగ్ ప్రారంభంకానుంది. అదేవిధంగా నగరంతోపాటు శివారు ప్రాంతాల నుంచి ఎయిర్‌పోర్టుకు కూడా ట్యాక్సీ సేవలు అందుబాటులోకి వస్తాయని ప్రీపెయిడ్ ట్యాక్సీ సంస్థ నిర్వాహకులు వెల్లడించారు. ప్రస్తుతం చెన్నై ఎయిర్‌పోర్టులో దాదాపు 300పైగా ప్రీ పెయిడ్ ట్యాక్సీ సర్వీసులున్నాయి. వీటిని ఉపయోగించుకునేందుకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సదుపాయం లేదు. అలాగే, డొమెస్టిక్ టెర్మినల్‌లో ప్రీపెయిడ్ ట్యాక్సీ రిజర్వేషన్ కౌంటర్ ఉండగా, ఇంటర్నేషనల్ టెర్మినల్‌లో మాత్రం ఈ సేవలు ఎయిర్‌పోర్టు బయట ఉన్నాయి. దీంతో విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రీపెయిడ్ ట్యాక్సీ ఆన్‌లైన్ బుకింగ్స్ సేవలు త్వరలోనే ప్రారంభించనున్నారు.

విద్యా ప్రదాత మోహన్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

● వర్థంతి సభలో వక్తలు


డా.మోహన్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీఎంకే రెడ్డి, ఏఐటీఎఫ్ నిర్వాహకులు

ప్యారీస్,జూలై22(ఆంధ్ర జ్యోతి): అఖిలభారత తెలుగు సమాఖ్య (ఏఐటీఎఫ్) ప్యాట్రన్, కనకదుర్గ తెలుగు పాఠశాలల వ్యవస్థాపకులు డాక్టర్ చిల్లకూరు మోహన్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. మోహన్‌రెడ్డి 5వ వర్థంతి సందర్భంగా మంగళవారం ఏఐటీఎఫ్ ఆధ్వర్యంలో నగరంలోని పలుప్రాంతాల్లోసేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఏఐటీఎఫ్ అధ్యక్షుడు, ఎస్కేడీటీ పాఠశాలల ఛైర్మెన్ డాక్టర్ సీఎంకే రెడ్డి, నిర్మలమ్మ, డాక్టర్ సీఎం కిషోర్, నాయకర్ నందగోపాల్, డాక్టర్ ఎన్.నాగభూషణం, డాక్టర్ గొల్లపల్లి ఇశ్రాయేలు, నేలటూరి విజయ్‌కుమార్, లయన్ జి. మురళి, ఊటుకూరు దేవదానం, నిర్మల్ చందర్, తమిళ మానిల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వీటీ జవహర్‌బాబు తదితరులు కొరట్టూరులోని మోహన్ గార్డెన్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 9.15 గంటలకు కీల్పాక్‌లోవున్న ఏఐటీఎఫ్ కార్యాలయ ప్రాంగణంలో పేదలకు అన్నదానం, వస్త్ర దానం అందజేశారు. మధ్యాహ్నం హాల్స్‌రోడ్డులోవున్న బాలవిహార్ సంరక్షణ కేంద్రంలో బుద్ధిమాంద్యం ఉన్న పిల్లలకు భోజనం, నెలకు సరిపడే నిత్యావసర సరకులు అందజేశారు. అలాగే నమో గాడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విల్లివాక్కం మథర్ థెరిస్సా నగర్‌లోవున్న అనుగ్రహ పిల్లల సంరక్షణ కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న విద్యార్థులకు సంక్షేమ సహాయాలు పంపిణీ చేశారు.

ఆరంబాక్కం అత్యాచారం కేసు...
నేరస్థుడి ఆచూకీ తెలిపితే రూ.5లక్షలు

● డీజీపీ ప్రకటన


పోలీసులు విడుదల చేసిన నేరస్థుడి ఫొటోలు

చెన్నై, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి సమీపంలోని ఆరంబాక్కం వద్ద బాలికపై అత్యాచారానికి పాల్పడిన నేరస్థుడి సమాచారం ఇస్తే రూ.5లక్షల బహుమానం అందజేస్తామని డీజీపీ శంకర్ జివాల్ ప్రకటించారు. ఆరంబాక్కం ప్రాంతంలో ఓ బాలిక ఈ నెల 12 సాయంత్రం స్కూలు విడిచిన తర్వాత బామ్మ ఇంటికి వెళుతుండగా వెనుకనే వచ్చిన ఓ యువకుడు ఆ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడి పారిపోయాడు. ఈ సంఘటనపై అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు నేరస్థుడిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నాలు, రాస్తారోకోలు జరిపారు. ఈ సంఘటనపై బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, తిరువళ్లూరు ఎస్పీ నేతృత్వంలో ముగ్గురు డీఎస్పీల పర్యవేక్షణలో 8 ప్రత్యేక పోలీసు బృందాలు నేరస్థుడి ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తున్నాయి. నేరస్థుడు విద్యుత్ లోకల్ రైలు పుట్‌బోర్డుపై కూర్చుని ప్రయాణిస్తున్న ఫొటో లభించడంతో అతడు పొరుగు రాష్ట్రమైన ఆంధ్ర ప్రదేశ్‌లోని సూళ్లూరుపేట, నెల్లూరు ప్రాంతాలకు పారిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. లైంగిక వేధింపులకు గురైన బాలిక ఆ యువకుడు ఫోన్‌లో హిందీలో మాట్లాడని పోలీసులకు చెప్పడంతో కొంతమంది పోలీసులు ఉత్తరాది రాష్ట్రాలకు బయలుదేరి వెళ్లారు. బాలికపై లైంగిక వేధింపులు జరిగి పది రోజులు గడిచినా నేరస్థుడిని పట్టుకోలేకపోవడంతో బాలికపై అత్యాచారానికి పాల్పడిన నేరస్థుడి సమాచారం తెలిపిన వారికి రూ.5లక్షల బహుమానం అందజేస్తామని డీజీపీ ప్రకటించారు. నేరస్థుడి ఆచూకీ 99520 60948 అనే నెంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలని, లేదా ఆ నెంబర్ వాట్సప్ ద్వారా సమాచారం పంపవచ్చునని డీజీపీ ఆ ప్రకటనలో తెలిపారు.

ఎంఎన్‌ఎం మహిళా నేతపై దాడి

ఆటో డ్రైవర్ అరెస్టు


ఆటో డ్రైవర్‌తో గొడవపడుతున్న స్నేహ

టి.నగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మక్కల్ నీదిమయ్యం (ఎంఎన్ఎ) మహిళా విభాగం కార్యదర్శి స్నేహతో గొడవపడి, ఆమెపై దాడిచేసిన ఆటో డ్రైవర్‌ను పోలీసులలు అరెస్టు చేశారు. సోమవారం సాయంత్రం స్నేహ ఓ ఆటోలో ప్రయాణించారు. ఆ సమయంలో ఆటోను డ్రైవర్ తారుమారుగా నడపటంతో స్నేహ అతడిని మందలించింది. ఆటో కీచైన్ తీసుకునేందుకు ప్రయత్నించింది. వెంటనే డ్రైవర్ ఆమెతో గొడవకు దిగాడు. ఈ సంఘటన గమనించిన స్థానికులు వారి మధ్య రాజీ కుదిర్చేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఈ సమాచారం అందుకుని మైలాపూరు పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని విచారణ జరిపారు. స్నేహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసుకుని ఆటో డ్రైవర్‌ను అరెస్టు చేశారు. ఇదే విధంగా ఆటో డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసుకుని స్నేహపై విచారణ జరుపుతున్నారు.

సంఘ సంస్కర్త కుమార్ కన్నుమూత


కుమార్ (ఫైల్‌ఫొటో)

ప్యారీస్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక కీల్పాక్ సమీపంలోని పుల్లాపురం గ్రామ ఆది ఆంధ్ర సేవా సంఘం కార్యదర్శి, నేషనల్ సఫాయ్ కర్మచారి మాజీ సభ్యుడు కనిమెరకల కుమార్ (59) గుండెపోటుతో సోమవారం రాత్రి మృతిచెందారు. ఏఐఎస్ఎంసీ తమిళనాడు అధ్యక్షులు, టీఎన్ఏఎంసీ, ఎస్ఎస్‌సీఎల్ఆర్ఎస్పీఎస్‌కే మాజీ సభ్యుడిగా వ్యవహరించిన కుమార్ కార్మికుల హక్కుల కోసం పోరాడి సాధించారు. అదేవిధంగా పుల్లాపురం గ్రామాభివృద్ధికి ఆదిఆంధ్ర సేవా సంఘం కార్యదర్శిగా తనవంతు కృషిచేశారు. ఈ నేపథ్యంలో, సోమవారం రాత్రి సుమారు 10.25 గంటల సమయంలో గుండెపోటుతో కుమార్ మరణించినట్లు ఆయన సతీమణి కాంతమ్మ తెలిపారు. కుమార్ మృతికి ఎమ్మార్పీఎస్, టామ్స్, ఏఐటీఎఫ్, కాంగ్రెస్ కార్మిక సంఘాలు సంతాపం ప్రకటించాయి. ఆయన నివాసంలో ప్రజల సందర్శనార్థం ఉంచిన భౌతికకాయానికి గ్రామ పెద్దలు, పలు సంఘాల నాయకులు అంజలి ఘటించారు. మంగళవారం సాయంత్రం కీల్పాక్ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ శ్మశాన వాటికలో ఆయన అంత్యక్రియలు జరిగాయి.

‘రెప్ప’పాటు కాలంలో....

డ్రైవర్ కునుకు తీయడంతో ఇంటిలోకి దూసుకెళ్లిన కారు ● వృద్ధుడి మృతి


ఇంటిని ఢీకొని ధ్వంసమైన కారు

చెన్నై, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా తిరుచెంగోడు వద్ద మంగళవారం వేకువజాము అదుపుతప్పిన కారు రోడ్డు పక్కనే ఉన్న బడ్డీకొట్లు, ద్విచక్రవాహనాలను ధ్వంసం చేసి, ఓ ఇంటిలో దూసుకెళ్ళింది. ఈ సంఘటనలో ఓ వృద్ధుడు ప్రాణాలు కోల్పోయాడు. తిరుచ్చి అరియమంగళం నుండి ఐదుగురు వ్యక్తులు కొల్లిమలైలోని పెరియణ్ణసామి ఆలయానికి వెళ్లారు. ఆ తర్వాత అందరూ కారులో తిరుగు ప్రయాణమయ్యారు. ఊంజనై వద్ద డ్రైవర్ కునుకు తీయడంతో కారు అదుపు తప్పి బస్టాపు వద్దనున్న తోపుడు బండిని ఢీకొంది. ఆ తర్వాత ద్విచక్రవాహనాలను ధ్వంసం చేస్తూ రహదారిని ఆనుకుని ఉన్న ఓ ఇంటిలో దూసుకెళ్ళింది. ఆ ఇంటి ఎదుట కుర్చీలో కూర్చుని ఉన్న మురుగేశన్ (67) అనే వృద్ధుడిని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే ఆయన మృతి చెందాడు. కారులో ప్రయాణించిన ఇద్దరు గాయపడ్డారు. ఈ సమాచారం అందుకుని హుటాహుటిన అక్కడికి వెళ్ళిన తిరుచెంగోడు రూరల్ పోలీసులు మురుగేశన్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. గాయపడిన ఇరువురిని చికిత్స కోసం తిరుచెంగోడు ఆసుపత్రికి పంపారు.

రష్యాలో అరెస్టయిన మెడికో విడుదల కోసం
కడలూరులో కుటుంబీకులు, బంధువుల ధర్నా


కడలూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా జరుపుతున్న కిషోర్ కుటుంబీకులు

చెన్నై, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రష్యాలో అరెస్టయిన శ్రీముష్ణం ప్రాంతానికి చెందిన వైద్య విద్యార్థి విడుదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ అతడి కుటుంబీకులు, బంధువులు కడలూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. శ్రీముష్ణం సమీపంలోని పాళయంకోటకు చెందిన కిషోర్ (22) రష్యాలో మెడిసిన్ కోర్సు చదివేందుకు వెళ్లాడని, ఇటీవల అతడిపై తప్పుడు కేసు బనాయించి అరెస్టు చేశారని అతడి తండ్రి శరవణన్, కుటుంబీకులు ఆరోపించారు. కిషోర్‌తో పాటు ఒకేగదిలో నివసించిన ముగ్గురు రష్యన్ యువకులు మాదక ద్రవ్యాల కేసులో అరెస్టయ్యారని, ఆ సమయంలో గదిలో ఉన్న కిషోర్‌పై కూడా మాదక ద్రవ్యాల కేసు బనాయించి అరెస్టు చేశారని అతడి తల్లిదండ్రులకు సమాచారం అందింది. ఈ పరిస్థితుల్లో కిషోర్‌ను జైలు శిక్ష నుండి విడిపించి స్వదేశానికి తీసుకువచ్చేందుకు తగు చర్యలు చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతూ కలెక్టరేట్ ఎదుట కిషోర్ కుటుంబీకులు, బంధువులు, స్థానికులు ధర్నా జరిపారు.

28న విరుదునగర్ జిల్లాకు సెలవు

చెన్నై, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28న విరుదునగర్ జిల్లాకు స్థానిక సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ సుకపుత్రా పేర్కొన్నారు. శ్రీవిల్లిపుత్తూరు దివ్యక్షేత్రంలో ఆడిపూర రథోత్సవం నిర్వహించనుండటంతో 28 సోమవారం సెలవు ప్రకటించి, ప్రత్యామ్నాయంగా ఆగస్టు 9న పనిదినంగా ప్రకటించారు.

స్నేహితుడి జ్ఞాపకార్థం హెల్మెట్ల పంపిణీ

ప్యారీస్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన స్నేహితుడి ఐదవ వర్థంతి సందర్భంగా ద్విచక్ర వాహనదారులకు అతడి స్నేహితులు వంద హెల్మెట్లు ఉచితంగా పంపిణీ చేశారు. వివరాల్లోకి వెళ్తే తిరుచ్చి జిల్లా తిరుబెరుంబూరు కక్కన్‌కాలనీకి చెందిన సురేందర్‌మణి (20) హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనం నడిపి రోడ్డుప్రమాదంలో మృతిచెందాడు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పించేలా సురేందర్‌మణి స్నేహితులు ప్రతిఏటా అతడి వర్థంతి సందర్భంగా వంద హెల్మెట్లు పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా తిరుబెరుంబూరు నగరంలో హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడిపిన వారికి ఏఎస్పీ అరవింద్ సమక్షంలో వంద హెల్మెట్లను పింపిణీ చేసి పలువురి ప్రశంసలందుకున్నారు.

మహిళ ఉదర కోశం నుంచి చెడురక్తం తొలగింపు

ప్యారీస్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పితో బాధపడుతూ చికిత్సకోసం ఆస్పత్రిలో చేరిన మహిళకు శస్త్ర చికిత్స ద్వారా కడుపులో చేరిన 2.5 లీటర్ల చెడురక్తాన్ని తొలగించి విల్లుపురం జిల్లా ప్రభుత్వాసుపత్రి వైద్యులు రికార్డు నెలకొల్పారు. జిల్లాలోని సెంజి సమీపంలోని తెన్‌పుత్తూరు గ్రామానికి చెందిన ఓ మహిళ (26)కు గత నెల 21వ తేదీ శస్త్ర చికిత్స నిర్వహించిన వైద్యులు చెడురక్తాన్ని తొలగించిన అనంతరం ఆమెకు 80 యూనిట్ల కొత్త రక్తం ఎక్కించారు. సీఎం బీమా పథకం కింద శస్త్ర చికిత్స అనంతరం కోలుకున్న ఆమెను సోమవారం డిశ్చార్జ్ చేసినట్లు డీన్ గీతాంజలి తెలిపారు.

కుట్రాలంలో పెరిగిన నీటి ఉధృతి

● స్నానాల నిషేధం

ప్యారీస్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కుట్రాలం జలపాతాల్లో నీరు ఉధ్రుతంగా వస్తుండడంతో స్నానాలు నిషేధిస్తూ జిల్లా యంత్రాంగం మంగళవారం జారీ చేసింది. తెన్‌కాశి జిల్లాలో సోమవారం రాత్రి నుంచి పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. పశ్చిమ కనుమల్లో వర్షాలు భారీ వర్షాల కారణంగా కుట్రాలం జలపాతాలకు అధికంగా నీరుచేరుతోంది. ఇక్కడున్న ఐదు జలపాతాల్లో నీటి ఉధృత పెరగటంతో పర్యాటకుల సంరక్షణార్థం మంగళ, బుధవారాల్లో స్నానాలు నిషేధిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

హిందూ మక్కల్ కట్చి ఆధ్వర్యంలో ప్రచారయాత్ర



తిరుత్తణి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మురుగన్ ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఉదయం 'హిందూ మక్కల్ కట్చి' ఆధ్వర్యంలో ప్రచార యాత్ర నిర్వహించారు. ఆ సంస్థ జిల్లా ఇన్‌ఛార్జి అర్జున్ సంపత్ అధ్యక్షతన జరిగిన యాత్రలో ఆయన మాట్లాడుతూ, 2026లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో హిందూ ఓట్లు చీలకుండా హిందువులంతా ఏకతాటిపై ఉండి, హిందూ ధర్మాన్ని పరిరక్షించేవారికే ఓటు వేయాలని పిలుపునిచ్చారు. అనంతరం తిరుత్తణి మురుగన్ దర్శనం చేసుకుని, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత తిరుత్తణి మున్సిపాలిటీ కార్యాలయం సమీపంలో సరిహద్దు పోరాటయోధుడు శివజ్ఞానం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హిందూ మక్కల్ కట్చి రాష్ట్రప్రధాన కార్యదర్శి గురుమూర్తి, సెంథిల్, డివైన్ కౌన్సిల్ అధ్యక్షుడు కార్తీక్‌తో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

లాకప్‌డెత్ వ్యవహారం....
మృతుడి కుటుంబానికి రూ.25 లక్షలు చెల్లించండి

● ఆదేశించిన హైకోర్టు

ప్యారీస్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా తిరుభువనంలోని అమ్మవారి ఆలయంలో వాచ్‌మన్‌గా పనిచేస్తూ పోలీస్‌స్టేషన్‌లో మృతిచెందిన అజిత్‌కుమార్ కుటుంబానికి మధ్యంతర నష్టపరిహారంగా రూ.25 లక్షలు చెల్లించాలని మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. నగల చోరీకి సంబంధించిన ఫిర్యాదులో అజిత్‌కుమార్‌ను ప్రత్యేక విభాగం పోలీసులు అదుపులోకి తీసుకోగా, విచారణ పేరిట చిత్రహింసలకు గురిచేసి హతమార్చినట్లు కుటుంబసభ్యులు, పలు ప్రజా సంఘాలు ఆందోళనలు చేపట్టాయి. ఈ వ్యవహారంలో ఐదుగురు పోలీసులను అరెస్టు చేసారు.. ప్రస్తుతం ఈ కేసుపై సీబీఐ అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. లాకప్‌డెత్ కేసుపై మంగళవారం విచారణ జరిపిన మదురై హైకోర్టు బెంచ్‌లో మృతిడి కుటుంబానికి మధ్యంతర నష్టపరిహారంగా రూ.25 లక్షలు చెల్లించాలని, చాలకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని ఆదేశించింది. పోలీసుల తరుపున హాజరైన న్యాయవాదులు ఈ కేసుపై దర్యాప్తు చేపట్టిన సీబీఐ అధికారులకు అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

బాణసంచా కర్మాగారం ప్రమాదం కేసులో ఇద్దరి అరెస్ట్

ప్యారీస్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా శివకాశి బాణసంచా కర్మాగారంలో సోమవారం పేలుడు సంభవించి ముగ్గురు కార్మికులు మృతిచెందిన కేసులో ఆ కర్మాగారం మేనేజర్ ప్రభాకరన్, ఫోర్‌మన్ సెల్వకుమార్‌లను పోలీసులు అరెస్టు చేశారు. శివకాశి సమీపం నారాయణపురం-అనుప్పన్‌కుళం రోడ్డులో శ్రీనివాసన్ నడుపుతున్న బాణసంచా కర్మాగారంలో సుమారు 50కి పైగా ఉన్న గదుల్లో 60 మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఆ ఫ్యాక్టరీలోని గది నుంచి మరో గదికి తయారుచేసిన టపాసులను తరలిస్తున్న సమయంలో హఠాత్తుగా పేలుడు సంభవించింది. ఇందులో సెల్వం (25), సంగీత (43), లక్ష్మి (45) అనే ముగ్గురు అగ్నికి ఆహుతయ్యారు. ఈ ఘటనలో నాలుగు గదులు నేలకూలాయి. ప్రమాదంపై కేసు నమోదు చేసిన శివకాశి పోలీసులు అగ్ని ప్రమాదం సంభవించిన బాణాసంచా కర్మాగారం మేనేజర్ ప్రభాకరన్, ఫోర్‌మెన్ సెల్వంను అరెస్టుచేసి పరారీలోవున్న యజమాని శ్రీనివాసన్ కోసం గాలిస్తున్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

ఎమ్మెల్యే వేల్‌మురుగన్

వేలూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియాత్తంలో మంగళవారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో బహిరంగ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో తమిళగ వాల్వురిమై కట్చి నాయకుడు వేల్‌మురుగన్ మాట్లాడుతూ, శాశ్వత ఉపాధి కోసం ఉపాధ్యాయులు చేస్తున్న నిరసనలపై ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని, మామిడి రైతులకు గిట్టుబాటు ధర ప్రకటించకుండా కాలయాపన చేస్తున్న డీఎంకేను ప్రజలు త్వరలోనే ఇంటికి సాగనంపుతారని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీలు, ఇతర ఎస్సీ, ఎస్టీ, ప్రజా సంఘాల నేతలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వేలూరు కలెక్టరేట్ వద్ద ఆటో వర్కర్స్ యూనియన్ నిరసన


నినాదాలు చేస్తున్న ఆటో వర్కర్స్ యూనియన్ నేతలు

వేలూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కలెక్ట రేట్ ప్రాంగణంలో మంగళవారం ఉదయం రాపిడో, ఊబర్, వోలా యాప్‌లను నిషేధించాలంటూ డిస్ట్రిక్ట్ ఆటో వర్కర్స్ యూనియన్, సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వేలుమలై అధ్యక్షతన నిర్వహించిన ఈ నిరసనలో ఆటో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు వేలుమలై మాట్లాడుతూ, పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో లాగే తమకు కూడా సంవత్సరానికి రూ.10వేలు సబ్సిడీ అందించాలని, ఊబర్, రాపిడో తదితర యాప్‌లను రాష్ట్రంలో బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆటో యూనియన్ నిర్వాహకులు వాసుదేవన్, సరోజా, మాణిక్యం, జిల్లా సీపీఎం పార్టీ నేతలు పాల్గొన్నారు.

వరకట్నం కోసం వేధింపులు

● భర్తపై మహిళ ఫిర్యాదు

ప్యారీస్, జూలై 22(ఆంధ్రజ్యోతి): స్థానిక మొగప్పేరులో రూ.కోటి వరకట్నం కోసం వేధించిన భర్తపై ఓ మహిళ తిరుమంగళం మహిళా పోలీసులకు ఫిర్యాదు చేశారు. మొగప్పేరుకు చెందిన 25యేళ్ల మహిళ సోమవారం అందజేసిన ఫిర్యాదులో అదేప్రాంతానికి చెందిన ప్రవీణ్‌కుమార్ (28)ను పెద్దల అనుమతితో వివాహం చేసుకున్నామని, ఆ సమయంలో కట్నంగా 60 సవర్ల నగలు, లక్షలు విలువ చేసే సారె అందజేసినట్లు తెలిపారు. దాంతో తృప్తిచెందని తన భర్త తమ పుట్టింటి నుంచి అదనంగా రూ.కోటి వరకట్నం తీసుకురావాలని తరచూ చిత్రహింసలకు గురిచేస్తున్నాడడని, అతడిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితురాలు ఫిర్యాదులో తెలిపింది. దాని ఆధారంగా ప్రవీణ్‌కుమార్‌పై వరకట్నం వేధింపుల కేసు నమోదు చేసి, విచారణ ప్రారంభించినట్లు తిరుమంగళం మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ సుబ్బులక్ష్మి తెలిపారు.

సకాలంలో సమస్యలను పరిష్కరించండి

● అధికారులకు కలెక్టర్ ఆదేశం


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతాప్

తిరుత్తణి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం ఉదయం ప్రత్యేక ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు హాజరుకాగా, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలను కలెక్టర్ ప్రతాప్‌కు అందజేశారు. వినతిపత్రాలు స్వీకరించిన కలెక్టర్ వాటి గురించి అధికారులతో చర్చించి సకాలంలో సమస్యల పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఇటీవల నీటిలో మునిగి మృతిచెందిన ఊత్తుకోటలోని పేరండూరు గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ కుటుంబానికి కలెక్టర్ ప్రతాప్ సీఎం సహాయనిధి నుంచి రూ.లక్ష చెక్కు అందజేశారు.

విద్యార్థినులు క్రీడల్లో కూడా రాణించాలి

● ఎమ్మెల్యే ఎస్.చంద్రన్


పోటీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో మంగళవారం ఉదయం విద్యార్థినుల మండలస్థాయి జిమ్నాస్టిక్ పోటీలను ఎమ్మెల్యే చంద్రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తిరువళ్లూరు జిల్లావ్యాప్తంగా ఉండే విద్యార్థినులు జిమ్నాస్టిక్స్‌లో ఆసక్తి చూపడం ప్రశంసనీయమని, విద్యార్థినులు చదువులోనే కాకుండా క్రీడాల్లోనూ రాణించాలన్నారు. తిరుత్తణిలో జరుగుతున్న ఈ పోటీలో తిరువలంగాడు, షోళింగర్, రాణిపేట తదితర ప్రాంతాలకు చెందిన విద్యార్థినులు షాట్‌పుట్, జంపింగ్, రన్నింగ్, జిమ్నాస్టిక్స్, కబడ్డీ తదితర పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంకే మండల కార్యదర్శులు ఆర్.రవి, వినోద్‌కుమార్ సహా పలు విభాగాల నేతలు పాల్గొన్నారు.

ఇంటర్‌లాక్ లేని గేట్ల వద్ద సీనియర్ గేట్ కీపర్లకు డ్యూటీ

ప్యారీస్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రైల్వేశాఖలో ఐదేళ్ల ఉత్తమ సేవలందించి అవార్డు పొందిన గేట్ కీపర్లను ఇంటర్‌లాక్ సదుపాయం గేట్ వద్ద నియమించాల్సిందిగా దక్షిణ రైల్వే ఉత్తర్వులు జారీచేసింది. కడలూరు జిల్లా ఆళపాక్కం రైల్వేగేట్‌లో ఈ నెల 8వ తేదీ పాఠశాల వాహనాన్ని విల్లుపురం ప్యాసింజర్ ఢీకొన్న ఘటనలో ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటన అనంతరం లెవల్ క్రాసింగ్ ప్రాంతాల్లో భద్రతాంశాలను మెరుగు పరచడం, ఇంటర్‌లాకింగ్ ఏర్పాటు చేయడం, ప్రతిరోజు రైల్వేగేట్లను సంబంధిత భద్రతా విభాగం అధికారులు పరిశీలించాల్సిందిగా రైల్వే శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో, దక్షిణరైల్వే పరిధిలోని రైల్వేగేట్లలో భద్రతా విభాగం అధికారులు రాత్రి సమయంలో హఠాత్తుగా తనిఖీలు చేసి సక్రమంగా విధులు నిర్వహించని గేట్ కీపర్లపై చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు ఇంటర్‌లాక్ సిస్టమ్ అందుబాటులోని గేట్ల వద్ద సీనియర్ గేట్‌మెన్లను డ్యూటీల్లో నియమించుకునేందుకు దక్షిణరైల్వే అనుమతులిచ్చింది. ముఖ్యంగా లెవల్ క్రాసింగ్ ప్రాంతాల్లో 100 మీటర్ల దూరం వరకు చెట్లు, ముళ్లపొదలు, చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రంగా ఉంచుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీఅయ్యాయి.

'బ్యాడ్‌గర్ల్' టీజర్‌ను తొలగించాలి

● హైకోర్టు ఆదేశం

టీనేజర్లపై తప్పుగా చిత్రీకరించిన 'బ్యాడ్ గర్ల్' చిత్ర టీజర్‌ను సోషల్ మీడియా నుంచి తొలగించాలని మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ ఆదేశించింది. మదురైకు చెందిన వెంకటేష్, రామ్‌కుమార్ తదితరులు దాఖలు చేసిన పిటిషన్‌లపై ఒకేసారి విచారణ జరిపిన కోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది. వీరు దాఖలు చేసిన పిటిషన్‌లో 'జనవరి 26న యూట్యూబ్, ఇతర సామాజిక మాధ్యమాల్లో 'బ్యాడ్‌గర్ల్' టీజర్ రిలీజ్ చేశారు. ఇందులో టీనేజర్ల కోసం తప్పుగా చిత్రీకరించిన దృశ్యాలున్నాయి. ఈ టీజర్ ఇప్పటికీ ఆన్‌లైన్‌లో ఉంది. ఇటువంటి దృశ్యాలు పిల్లల అశ్లీలత, చిన్నారుల లైంగిక దోపిడి వంటి నేరాల కిందకు వస్తాయి. అందువల్ల ఈ టీజర్‌ను సోషల్ మీడియా నుంచి తొలగించాలి' అని కోరారు. వీటిపై విచారణ జరిపిన న్యాయమూర్తి ధనపాల్ తాజాగా తీర్పునిస్తూ, 'అమ్మాయిలు, అబ్బాయిలను అశ్లీలంగా చూపించిన ఈ చిత్ర టీజర్‌ను సోషల్ మీడియా నుంచి తొలగించాలి. భవిష్యత్‌లో ఇలాంటి వీడియోలు సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయకుండా కేంద్రం తగిన చర్యలు తీసుకోవాలి. అలాగే, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకునేందుకు దానికి సంబంధించిన అధికారికి పిటిషనర్లు ఫిర్యాదు చేయాలంటూ న్యాయమూర్తి ఆదేశిస్తూ కేసు విచారణను ముగించారు. కాగా, జాతీయ అవార్డు గ్రహీత వెట్రిమారన్ నిర్మాణ సారథ్యంలో వర్షా భరత్ దర్శకత్వంలో అంజలి శివరామన్ ప్రధాన పాత్రలో ఈ సినిమా తెరకెక్కింది.


'బ్యాడ్‌గర్ల్'లో అంజలి శివరామన్

27న ఫ్యాన్స్‌కు ధనుష్ బర్త్‌డే స్పెషల్


'ఇడ్లీకడై'లో ధనుష్ తదితరులు

స్టార్ హీరో ధనుష్ పుట్టిన రోజు సందర్భంగా 'ఇడ్లీకడై' సినిమా నుంచి తొలి లిరికల్ సాంగ్‌ను విడుదల చేయనున్నారు. అక్టోబరు ఒకటో తేదీ విడుదలకానున్న ఈ చిత్రానికి ధనుష్ దర్శకత్వం వహించిన విషయం తెల్సిందే. ఇందులో ఆయనతో పాటు రాజ్‌కిరణ్, సత్యరాజ్, పార్తిబన్, అరుణ్ విజయ్, నిత్యా మేనన్, షాలిని పాండే వంటి ప్రధాన తారాగణం నటించారు. డాన్ పిక్చర్స్, వుండర్‌బార్ ఫిలిమ్స్, రెడ్ జెయింట్ మూవీస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకుని తుదిదశ నిర్మాణ పనులను జరుపుకుంటోంది. ఈ నేపథ్యంలో ఈ నెల 28వ తేదీ ధనుష్ పుట్టిన రోజు సందర్భంగా ఈ నెల 27నే ఈ మూవీ నుంచి ఫస్ట్ సింగిల్‌ను చిత్ర బృందం విడుదల చేయనుంది. ఇది ధనుష్ అభిమానులకు బర్త్‌డే గిఫ్ట్ అంటూ మేకర్స్ పేర్కొన్నారు.


'మదరాసి'లో శివకార్తికేయన్

లండన్‌లో 'మదరాసి' ఆడియో రిలీజ్ వేడుక?

ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో శివకార్తికేయన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మదరాసి' ఆడియో రిలీజ్ వేడుకను లండన్‌లో భారీ స్థాయిలో నిర్వహించాలని భావిస్తున్నారు. శివకార్తికేయన్ సరసన రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటించగా, ఇతర పాత్రల్లో విద్యుత్ జమాల్, విక్రాంత్, సబీర్, బిజు మేనన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. శ్రీ లక్ష్మి మూవీ మేకర్స్ బ్యానరులో తెరకెక్కిన ఈ చిత్రానికి అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం. సెప్టెంబరు 5న విడుదల చేయనున్నట్టు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. దీంతో ఆడియో రిలీజ్ ఆగస్టు నెలాఖరులో లండన్‌లో గ్రాండ్‌గా నిర్వహించాలని భావిస్తున్నారు. ఇదిలావుంటే, ఈ సినిమా నుంచి ఫస్ట్ లిరికల్ సింగిల్ ఈ వారంలో విడుదల చేయనున్నారు.

కోలీవుడ్‌లో తారతమ్యాలు లేవు

● శిల్పా మంజునాథ్

చిత్రజ్యోతి

తమిళ చిత్రపరిశ్రమలో ఎలాంటి తారతమ్యాలు, ప్రాంతీయ, భాషా భేదాలు లేవని, అందుకే ఇక్కడ తమలాంటి యువ నటీనటులకు అవకాశాలు పుష్కలంగా లభిస్తున్నాయని యువ హీరోయిన్ శిల్పా మంజునాథ్ పేర్కొన్నారు. కన్నడ చిత్రపరిశ్రమకు చెందిన ఆమె.. తమిళంలో పలు అవకాశాలు దక్కించుకుంటున్నారు.ఈ అంశంపై ఆమె మాట్లాడుతూ, 'నేను కన్నడ వాసిని. నాకు సినిమా అవకాశం కల్పించిన తమిళ మట్టికి ఎన్నటికీ రుణపడి వుంటాను. కోలీవుడ్‌లోకి అడుగుపెట్టిన కొత్తల్లో నాకు తమిళం తెలియదు. నటన కూడా పెద్దగా రాదు. మరో రాష్ట్రానికి చెందిన నటి అయినప్పటికీ ప్రతిభను గుర్తించి అవకాశం కల్పించారు. మున్ముందు మరిన్ని వైవిధ్యభరితమైన పాత్రల్లో నటిస్తానన్న నమ్మకం ఉంది' అని పేర్కొన్నారు.



ప్రజా సంక్షేమమే మా లక్ష్యం

● మంత్రి దురైమురుగన్


మహిళకు ఇళ్లపట్టా అందజేస్తున్న మంత్రి దురైమురుగన్

వేలూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తన రాజకీయ ప్రస్థానంలో ప్రజలకు పలు రకాల సంక్షేమ పథకాలను అందించామని మంత్రి దురైమురుగన్ తెలిపారు. వేలూరు జిల్లా కాట్పాడిలో మంగళవారం ఉదయం ఉచిత గృహ నిర్మాణ పథకం కింద మహిళలకు ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి దురైమురుగన్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం ప్రజల సంక్షేమార్థం ప్రవేశపెట్టే పథకాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని, అదే విధంగా సుమారు రూ.23 కోట్లతో ఉచిత ఇళ్ల నిర్మాణం పనులు ప్రారంభించి పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నట్లు తెలిపారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ప్రజలను తప్పుదారి పట్టించేలా వ్యవహరిస్తున్నారని, మతతత్వ బీజేపీతో చేతులు కలిపి ఇతర పార్టీలను కూడా అందులోకి ఆహ్వానిస్తున్నారన్నారు. పళనిస్వామి ఎంత ప్రయత్నించినా ద్రావిడ మోడల్ ప్రభుత్వమైన డీఎంకేకు ప్రజల మద్దతు ఉందని, మళ్లీ సీఎం స్టాలిన్ నాయకత్వంలో అధికారం చేపడుతామని ఆయన తెలిపారు. అనంతరం పేద మహిళలకు కుట్టు మెషీన్లు, దివ్యాంగులకు వాహనాల సహా, లబ్ధిదారులకు సంక్షేమ సహాయాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి, ఎమ్మెల్యే కార్తికేయన్, మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ సునీల్, తహసీల్దార్ జగదీశ్వరన్ సహా పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


'శ్రీహర్'తో అజిలిసియం ఒప్పందం


ఒప్పంద కార్యక్రమంలో ఇరువర్గాల ప్రతినిధులు

చెన్నై, జూలై 22 (ఆంధ్రజ్యోతి): లైఫ్ సైన్సెస్ పరిశ్రమకు ప్రముఖ స్వయం ప్రతిపత్తి ఏజెంట్ ఏఐ భాగస్వామి అయిన అజిలిసియం 'శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్' (శ్రీహర్)తో ఒప్పందం కుదుర్చుకుంది. ఇటీవల జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు ఒప్పందపత్రాలపై సంతకం చేశారు. ఈ సందర్భంగా అజిలిసియం సీఈవో రాజ్‌బాబు మాట్లాడుతూ.. ఏజెంటిక్ ఏఐ ద్వారా లైఫ్ సైన్సెస్, హెల్త్‌కేర్‌ను మార్చాలనే లక్ష్యంలో ఈ భాగస్వామ్యం ఒక నిర్ణయాత్మక క్షణాన్ని సూచిస్తుందన్నారు. శ్రీహర్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఉమా శేఖర్ మాట్లాడుతూ.. రోగి సంరక్షణ మెరుగుదల కోసం సైన్స్, విద్య, సాంకేతికతను ఏకీకృతం చేయాలనే తమ లక్ష్యంతో ఈ అవగాహన ఒప్పందం సంపూర్ణంగా సరిపోతుందని వివరించారు.

రాయపేటలో క్యాన్సర్ హాస్పిటల్

● పరిశీలించిన మంత్రి సుబ్రమణ్యం


క్యాన్సర్ హాస్పిటల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఆరోగ్యశాఖ మంత్రి

టి.నగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయపేట ప్రభుత్వ ఆస్పత్రి వద్ద రూ.10.27 కోట్లతో నిర్మిస్తున్న క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణ పనులను ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం అధికారులతో కలిసి పరిశీలించారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాయపేట ఆస్పత్రి వద్ద నిర్మిస్తున్న క్యాన్సర్ ఆస్పత్రిని మూడు నెలల్లో ప్రారంభించనున్నామని, ఆ లోగా పనులన్నింటిని పూర్తిచేయమని అధికారులకు ఆదేశాలిచ్చినట్టు తెలిపారు. ప్రస్తుతం రాయపేట ఆస్పత్రి వద్దే రూ.40.50 కోట్లతో అదనపు భవనాల నిర్మాణ పనులు కూడా జరుగుతున్నాయని వివరించారు.

బ్లూఫ్లాగ్ ప్రమాణాలతో

మెరీనాబీచ్‌కు నూతన సొబగులు



మెరీనాబీచ్‌లో వెదురుకొయ్యలతో తయారైన లవ్‌సింబల్


మెరీనా స్విమ్మింగ్‌పూల్ వెనుకవైపు స్వాగత తోరణం


వెదురుకొయ్యలతో రూపొందించిన ధ్యానస్థలం


విదేశీ కొంగల శిల్పాలు


దివ్యాంగుల కోసం వీల్ చైర్లు


డాల్ఫిన్ శిల్పం

చెన్నై, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైలోని మెరీనాబీచ్‌కు డెన్మార్క్ సంస్థ నుంచి బ్లూఫ్లాగ్ గుర్తింపు పొందేలా గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ అధికారులు పిక్నిక్ స్పాట్‌లో నూతన సొబగులు అద్దుతున్నారు. సముద్రతీరాల్లో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, సమర్థవంతమైన నిర్వహణ తదితర అంశాలను చక్కగా పాటించినందుకుగాను డెన్మార్క్‌కు చెందిన ఫౌండేషన్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ (ఎఫ్ఈఈ) బీచ్‌లకు బ్లూఫ్లాగ్ అంతర్జాతీయ గుర్తింపును ప్రకటిస్తుంది. కర్ణాటకలోని కాసర్‌కోడ్, పాడుబిద్రి బీచ్‌లు ఈ ప్రతిష్టాత్మక పర్యావరణ లేబుల్స్ పొందాయి.. ఆ కోవలోనే మెరీనాబీచ్‌ను అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ప్రణాళిక అమలు చేస్తోంది. మెరీనాబీచ్‌తోపాటు తిరువాన్మియూరు, పాలవాక్కం, ఉత్తాండి బీచ్‌లను కూడా బ్లూఫ్లాగ్ ప్రమాణాలతో అభివృద్ధి చేయనుంది.ప్రస్తుతం మెరీనా బీచ్ స్విమ్మింగ్ పూల్ సమీపంలో సుందరీకరణ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఈ నెలాఖరులోగా ఈ బీచ్ ప్రాంతంలో విదేశీ బీచ్‌లతో పోటీపడేలా కొంత అందాలతో సందర్శకులను ఆకట్టుకోనుంది. 30 ఎకరాల విస్తీర్ణంలో బీచ్ పొడవునా వెదురు గొడుగులు 40 దాకా ఏర్పాటు చేశారు. నాలుగు వాచ్‌టవర్లు, ఓపెన్ జిమ్ ఎక్విప్‌మెంట్, వెదురుతో తయారైన చెత్తబుట్టలు, వెదురు కొయ్యలతో అందంగా తయారైన స్వాగత తోరణాలు, 30 వీల్ చైయిర్లు, ధ్యానస్థలాలు ఏర్పాటు చేశారు. బీచ్‌ను కుటుంబ సభ్యులతో పాటు సందర్శించిన అయనవరానికి చెందిన ఎన్.శకుంతల మాట్లాడుతూ మెరీనాబీచ్‌లో అడుగుపెట్టగానే ఏదో విదేశాల్లో ఉన్న అనుభూతి కలిగిందన్నారు. చూడచక్కని కొత్త అందాలు, సెల్ఫీపాయింట్లు, గొడుగులు, కుర్చీలు, స్వాగత తోరణాలలతో ఇది మన మెరీనాబీచేనా అనే అనుమానం కూడా కలుగుతుందని అంటూ సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు.


చెన్నై చోళింగనల్లూరు వద్ద వ్యర్థాల తొలగింపు కోసం కొనుగోలు చేసిన ట్రాక్టర్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న జీసీసీ మేయర్ ఆర్. ప్రియ తదితరులు

65 అడుగులకు పెరిగిన వైగై డ్యామ్ నీటిమట్టం


వైగై డ్యామ్ నుంచి విడుదలవుతున్న జలాలు

చెన్నై, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లాలోని వైగై డ్యామ్ నీటి మట్టం మంగళవారం ఉదయం 65 అడుగులకు పెరిగిందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. కేరళలోని ముల్లై - పెరియార్ డ్యామ్ పరీవాహక ప్రాంతాల్లో భారీగా కురిసిన వర్షాలకు ఆ డ్యామ్‌లో నీటిమట్టం పెరగడంతో అదనపు జలాలను విడుదల చేస్తున్నారు. ఆ నీరంతా వైగై డ్యామ్‌లోకి చేరుతోంది. వైగై డ్యాం పూర్తి సామర్థ్యం 71 అడుగులు కావడంతో, ప్రస్తుతం డ్యాంలో నీటిమట్టం 65 అడుగులకు చేరింది. సాగు, తాగునీటి సరఫరా కోసం సెకనుకు 869 ఘనపుటడుగుల చొప్పున జలాలను విడుదల చేస్తున్నారు.

చదురగిరికి పోటెత్తిన భక్తులు


చదురగిరి పైకి నడిచివెళ్తున్న భక్తులు

చెన్నై, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆడి ప్రదోషం సందర్భంగా మంగళవారం ఉదయం చదురగిరి ఆలయానికి భక్తులు పోటెత్తారు. చదురగిరి పర్వతంపై ఉన్న సుందర మహాలింగం ఆలయంలో ఆడి అమావాస్య ఉత్సవాలు ఈ నెల 24న ప్రారంభమవుతున్నాయి. ఆ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆడి ప్రదోష పూజలు జరిగాయి. ఈ పూజల కోసం చెన్నై, కోయంబత్తూరు, మదురై సహా పలునగరాల నుండి భక్తులు చదురగిరి పర్వతానికి చేరుకున్నారు. మంగళవారం వేకువజాము 5.45 గంటలకు అటవీ శాఖ అధికారులు కొండపైకి వెళ్లేందుకు భక్తులను అనుమతించారు. ఆ పర్వత ప్రాంతంలో ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడుతుండటంతో భక్తులంతా శివనామస్మరణ చేసుకుంటూ కొండపైకి నడచుకుంటూవెళ్లారు. సాయంత్రం 4.30- గంటలకు సుందరమహాలింగం స్వామివారికి 18 రకాల సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారిని పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ నెల 24న ఆడి అమావాస్యను పురస్కరించుకుని లక్షలాదిమంది భక్తులు చదురగిరి పర్వతాలయానికి రానున్నారు. ఈ భక్తులకు ఆలయ ట్రస్టీ రాజా అలియాస్ పెరియసాయి, కార్యనిర్వహణాధికారి రామకృష్ణన్ ఏర్పాట్లు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారు.

నాథధీశ్వరుని సేవలో బీజేపీ నేతలు


ఆలయ నిర్వాహకులతో బీజేపీ నేతలు

తిరుత్తణి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు నార్త్ యూనియన్ బీజేపీ నేతలు మంగళవారం ఉదయం కరింబేడులోని నాథదీశ్వరాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా నాయకుడు కిరణ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర రాజకీయాల్లో మార్పు రావాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలనే ఉద్దేశంతో నాథదీశ్వరుడి ఆశీస్సుల కోసం ఆలయానికి వచ్చినట్లు తెలిపారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు ఆయన ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ కార్యదర్శి పి.భాస్కర్, పళ్లిపట్టు యూనియన్ అధ్యక్షుడు ఎ.కిరణ్‌కుమార్, నార్త్ ప్రెసిడెంట్ సి.సురేష్, ఎన్.రామకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

నడిరోడ్డులో ఆగిన 'మెట్రో యంత్రం'

● నుంగంబాక్కంలో స్తంభించిన ట్రాఫిక్

చెన్నై, జూలై 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక నుంగంబాక్కం వద్ద మెట్రోరైలు సొరంగమార్గం తవ్వకాల కోసం తెప్పించిన భారీ యాంత్రిక వాహనం నడిరోడ్డులో కదలక మొరాయించింది. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. నుంగంబాక్కం గాంధీ - ఇర్విన్ రోడ్డులో మెట్రోరైలు మార్గం తవ్వకాలు జరుగుతున్నాయి. ఇక్కడ భారీ యంత్రాలతో తవ్వకాలు చేపడుతున్నారు. మంగళవారం ఉదయం ఆ ప్రాంతంలో తవ్వకాల కోసం తీసుకువచ్చిన భారీ వాహనం నడిరోడ్డులో కదలకుండా ఆగిపోయింది. దీంతో ఆ మార్గంలో విపరీతమైన ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. ఆ భారీ యాంత్రిక వాహనాన్ని మరమ్మతు చేయడాదనికి ఇంజనీరింగ్ నిపుణులు కూడా వచ్చారు. ఓ వైపు యాంత్రిక వాహనాన్ని మరమ్మతు చేస్తుండగా, మరో వైపు తమ వాహనాలను ఏ వైపు నడపాలో తెలియక వాహనచోదకులు అయోమయం కాగా, ట్రాఫిక్ క్రమబద్ధం చేయడానికి ట్రాఫిక్ పోలీసులు నానా తంటాలు పడ్డారు.

బస్ ఛార్జీలు పెంచే ఉద్దేశం లేదు

● మంత్రి శివశంకర్


రవాణాశాఖ మంత్రి శివ శంకర్

ప్యారీస్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ రవాణా సంస్థల బస్సుల్లో ఛార్జీలు పెంచే ఉద్దేశం లేదని రవాణాశాఖ మంత్రి శివశంకర్ స్పష్టం చేశారు. అరియలూరులో మంత్రి మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇటీవల కాలంగా బస్ ఛార్జీలు పెరిగినట్టు సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలు నిజంకాదని, ప్రభుత్వానికి బస్ ఛార్జీలు పెంచాల్సిన అవసరం రాదన్నారు. ఇంధనం ధరలు పెరుగుతున్నప్పటికీ బస్ ఛార్జీల పేరుతో ప్రజలపై ఆర్థిక భారం మోపకుండా ప్రభుత్వమే రవాణా సంస్థలను నడుపుతోందని మంత్రి వివరించారు. మతవాద బీజేపీ, అన్నాడీఎంకేను తన గుప్పెట్లో ఉంచుకుని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రావాలని కంటున్న కల ఫలించే అవకాశమే లేదన్నారు. డీఎంకే నేతృత్వంలోని కూటమి బలంగా ఉందని, ఈ కూటమిని చీల్చాలన్న ప్రయత్నాలు కూడా ఫలించబోవన్నారు. 2036 వరకు బీజేపీతో పొత్తులేదన్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఈపీఎస్ మాట నిలబెట్టుకోకుండా కమలంతోనే చేతులు కలిపారని మంత్రి శివశంకర్ వ్యాఖ్యానించారు.


చెన్నై సీపీఎం కార్యాలయంలో కేరళ మాజీ ముఖ్యమంత్రి దివంగత వీఎస్ అచ్యుతానందన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ నేతలు పి.షణ్ముగం, కె.బాలకృష్ణన్ తదితరులు

ఐశ్వర్య రజనీకాంత్ ఆర్థిక సాయం

అడయార్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సూపర్‌స్టార్ రజనీకాంత్ పెద్ద కుమార్తె, సినీ దర్శకురాలు, నిర్మాత ఐశ్వర్య రూ.10 లక్షల ఆర్థిక సాయం చేశారు. చిత్రపరిశ్రమకు చెందిన అసిస్టెంట్, కో డైరెక్టర్ల పిల్లల చదువుల కోసం ఆమె ఈ ఆర్థిక సాయం చేశారు. ఈ చెక్కును మంగళవారం పెఫ్సీ అధ్యక్షుడు, సినీ దర్శకుడు ఆర్కే సెల్వమణి, కోలీవుడ్ దర్శకుల సంఘం అధ్యక్షుడు, దర్శకుడు ఆర్‌వీ ఉదయకుమార్ సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో కోలీవుడ్ దర్శకుల సంఘం ప్రధాన కార్యదర్శి పేరరసు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థికి ఆర్థిక సాయం చేస్తున్న దృశ్యం

శ్రీవారి సేవలో ప్రముఖులు





బీసీ జనార్ధన్ రెడ్డి - ప్రమోదదేవి, కృష్ణదత్త చామరాజ్ వడియార్ - స్వప్న దత్

తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వేకువజాము సుప్రభాత సేవలో రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శ్రీవారిని దర్శించుకోగా, ఉదయం వీఐపీ బ్రేక్‌లో దర్శనం చేసుకున్నవారిలో మైసూరు సంస్థానం రాజమాత ప్రమోదదేవి, మహారాజు యదువీర్ కృష్ణదత్త చామరాజ్ వడియార్, సినీ నిర్మాత స్వప్న దత్, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి, తెలంగాణ ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, ధన్‌పాల్ సూర్యనారాయణ ఉన్నారు. దర్శనం అనంతరం మైసూరు సంస్థానం రాజమాత ప్రమోదదేవి, మహారాజు కృష్ణదత్త మీడియాతో మాట్లాడుతూ.. పల్లవోత్సవం సందర్భంగా తిరుమలకు వచ్చి స్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. తరతరాలుగా తమ వంశీకులందరూ స్వామి సేవలో తరిస్తున్నారని చెప్పారు.


- తిరుమల, ఆంధ్రజ్యోతి

'దండోరా' చేస్తున్నా: నందు



తిరుమల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నటుడు శివాజీతో కలిసి 'దండోరా' అనే చిత్రంలో నటిస్తున్నట్లు హీరో నందు తెలిపారు. శివాజీ తన తండ్రి పాత్రలో నటిస్తున్నారని వెల్లడించారు. తిరుమల శ్రీవారిని ఆయన మంగళవారం దర్శించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడుతూ 'అగ్లీ స్టోరీ' అనే మరో చిత్రంలోనూ నటిస్తున్నట్టు చెప్పారు. నిర్మాతగా తాను తీయబోతున్న చిత్రంలో పెద్ద హీరో నటిస్తున్నారని, ఆగస్టు మొదటి లేదా రెండవ వారంలో ఆ చిత్రానికి సంబంధించిన వివరాలు వెల్లడిస్తామన్నారు.

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని తొమ్మిది షెడ్లు నిండిపోయి క్యూలైన్ కృష్ణతేజ విశ్రాంతి భవనం వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.96 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 77,481

తలనీలాలు సమర్పించినవారు: 30,612

'నిసార్' సిద్ధం



ఇస్రో-నాసా సంయుక్తంగా రూపొందించిన 'నిసార్' ఉపగ్రహం షార్ నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్ ద్వారా ఈ నెల 30న ఎగిరేందుకు సిద్ధమైంది. రెండు రోజుల క్రితం షార్‌లోని శాటిలైట్ ప్రిపరేషన్ బిల్డింగ్ నుంచి ఉపగ్రహాన్ని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ పచ్చజెండా ఊపి రెండో ప్రయోగ వేదిక వద్దనున్న వ్యాబ్‌కు తరలించారు. అక్కడ రాకెట్ మూడు దశల అనుసంధాన పనులు, రాకెట్ శిఖర భాగాన ఉపగ్రహాన్ని అమర్చే ప్రక్రియను శాస్త్రవేత్తలు పూర్తి చేశారు. ఈ ఫొటోలను ఇస్రో మంగళవారం విడుదల చేసింది. మరో రెండు రోజుల్లో వ్యాబ్ నుంచి రెండో ప్రయోగ వేదికకు రాకెట్‌ను తరలించేందుకు శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి



అధికార పార్టీ నేతలకు సమన్లు ఇవ్వరా?

● పోలీసులను ప్రశ్నించిన హైకోర్టు

ప్యారీస్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అధికార పార్టీలో ఉన్న నేతలు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా సమన్లు ఇవ్వరా అని మద్రాస్ హైకోర్టు పోలీసులను ప్రశ్నించింది. తిరునల్వేలి జిల్లా పాళయంకోట ఇట్టేరి ప్రాంతానికి చెందిన చర్చి ఫాదర్ గాడ్‌ఫ్రే వాషింగ్టన్ నోబుల్‌పై 2023 జూన్ 26న డీఎంకే మాజీ ఎంపీ జ్ఞానద్రవ్యం మద్దతుదారులు దాడి చేశారనే ఫిర్యాదు ఆధారంగా పాళయంకోట పోలీసులు 36 మందిపై కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణను వేగవంతం చేయాలని తిరునల్వేలి న్యాయస్థానానికి విజ్ఞప్తి చేస్తూ మద్రాస్ హైకోర్టులో బాధిత ఫాదర్ తరుపున పిటిషన్ దాఖలైంది. గతంలో ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం మాజీ ఎంపీ జ్ఞానద్రవ్యంకు వ్యతిరేకంగా నమోదు చేసిన ఎఫ్ఐఆర్ దాఖలు చేయాల్సిందిగా తిరునల్వేలి కోర్టుకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసు మళ్ళీ హైకోర్టు న్యాయమూర్తి వేల్‌మురుగన్ ముందుకు విచారణకు వచ్చింది. అప్పుడు హైకోర్టు రిజిస్ట్రేషన్‌శాఖ తరుపున జ్ఞానద్రవ్యానికి వ్యతిరేకంగా నమోదు చేసిన కేసు వివరాలను సమర్పించింది. వీటిని పరిశీలించిన న్యాయమూర్తి జ్ఞానద్రవ్యానికి వ్యతిరేకంగా కేసు నమోదు చేసిన తర్వాత ఆరు నెలల వరకు ఆయనకు సమన్లు ఎందుకు పంపించలేదని, అధికార పార్టీకి చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలైతే సమన్లు ఇవ్వరా? అని ప్రశ్నించారు. ఈ కేసు తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేసిన న్యాయమూర్తి జ్ఞానద్రవ్యానికి గత ఏడాది నవంబరులో పంపించిన సమన్ గురించి, ఆయనకు వ్యతిరేకంగా తీసుకున్న చర్యల గురించి నివేదిక దాఖలు చేయాల్సిందిగా ఉత్తర్వులు జారీచేశారు.

ఓఎల్ఎక్స్‌లో ఫోను పెడితే చాలు..!

● కొంటానంటూ వస్తాడు ● సోదరుడికి ఫోను చూపిస్తానంటూ పారిపోతాడు
● మళ్లీ ఫోను అమ్మకానికి పెట్టి పట్టుకున్న బాధితుడు



నిందితుడిని అదుపులోకి తీసుకున్న యువకులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 22(ఆంధ్రజ్యోతి): ఓఎల్ఎక్స్ యాప్‌లో ఖరీదైన ఫోనును అమ్మకానికి పెడితే చాలు. నేను కొంటానంటూ ఫోను చేస్తాడు. నేరు గా కలిశాక మాయమాటలు చెప్పి.. ఇంట్లో చూపించి వస్తానంటూ ఆ ఫోనుతో పారిపోతాడు. అలాంటి మోసగాడిని.. ఓ బాధితుడే తన స్నేహితులతో కలిసి రెండు రోజుల కిందట పట్టుకున్నారు. ఇందులో బాధితుడు తిరుపతికి చెందిన సోని అయి తే నిందితుడు విజయవాడవాసి సుబ్రహ్మణ్యం. వివరాలిలా ఉన్నాయి. విజయవాడకు చెందిన సుబ్రహ్మణ్యం తిరుపతిలో ఉంటూ మోసాలకు పాల్పడుతున్నాడు. పది రోజుల కిందట పద్మావతినగర్‌కు చెందిన సోని తన యాపిల్ ఫోన్‌ను విక్రయించడానికి ఓఎల్ఎక్స్ యాప్‌లో పెట్టారు. ఓఎల్ఎక్స్‌లో చూసిన సుబ్రహ్మణ్యం.. ఆ నెంబరుకు ఫోను చేశాడు. యాపిల్ ఫోన్ మొత్తం క్లియర్ చేసుకుని.. కొరమేనుగుంట వద్ద ఉన్న తన వద్దకు తీసుకొస్తే మాట్లాడి కొనుక్కొంటానని చెప్పాడు. ఆ ప్రకారం మొబైల్ ఫోన్ తీసుకుని సోని వెళ్లారు. ఈ ఫోన్ చూసిన సుబ్రహ్మణ్యం.. ఇదే అపార్టుమెంటులో ఉంటున్న తన సోదరుడికి చూపించి తీసుకొస్తానని చెప్పి వెళ్లాడు.రెండు గంటలైనా రాక పోయే సరికి అతడికి ఫోన్ చేశారు.తాను ఇక్కడే ఉన్నానని, వస్తానంటూ చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. చివరకు మోసపోయానని గుర్తించిన బాధితుడు.. తిరుపతి ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఎలాగైనా నిందితుడ్ని పట్టుకోవాలని..

ఖరీదైన ఫోన్ లాక్కెళ్లిన ఆ మోసగాడిని వదిలేయకూడదని సోని, అతడి స్నేహితులు భావించారు. అతడిని పట్టుకునేందుకు పథకం పన్నారు. మళ్లీ ఓఎల్ఎక్స్ యాప్‌లో యాపిల్ ఫోన్ విక్రయానికి ఉంచారు. దీనిపైనా స్పందించిన సుబ్రహ్మణ్యం.. ఆ ఫోన్ కొంటానంటూ ఆ నెంబరుకు సంప్రదించాడు. తాను ఓ కారు షోరూము వద్ద ఉన్నానని, అక్కడికి ఫోన్ తీసుకొస్తే చూసి కొనుక్కుంటానని చెప్పాడు. రెండు రోజుల కిందట సోనితో పాటు అతడి స్నేహితులు దాదాపు 10 మంది అక్కడకు వెళ్లారు. సోని దూరంగా ఉండగా.. మిగతా స్నేహితులు కథ నడిపారు. వీరి వద్ద ఫోను చూసి ధర ఎంత అని సుబ్రహ్మణ్యం అడగ్గా.. వారు రూ.1.5 లక్షలని చెప్పారు. దీనికి సరేనన్న సుబ్రహ్మణ్యం.. ఫోను ఇస్తే సోదరుడికి చూపించి వస్తానన్నాడు. ఆ వెంటనే వీరంతా మోసగాడిని పట్టుకున్నారు. తమ వాహనంలో తీసుకొచ్చి తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులుకు అప్పగించారు. పోలీసుల విచారణలో సోని ఫోను ఎక్కడ అమ్మింది చెప్పాడు. ఆ ప్రకారం ఓ మొబైల్ షాపు వద్దకు వెళ్లి ఆ యాపిల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇలా, దాదాపు 20 నుంచి 30 ఐ ఫోన్లు లాక్కొని పరారైనట్లు సమాచారం.

శ్రీవాణి ట్రస్టు భక్తులకు నూతన భవనం



కౌంటర్లు ప్రారంభిస్తున్న టీటీడీ చైర్మన్, ఈవో, అధికారులు

తిరుమల, జూలై22(ఆంధ్రజ్యోతి): శ్రీవాణి దర్శన టికెట్లు జారీ చేసేందుకు తిరుమల అన్నమయ్య భవనం ఎదురుగా ఉన్న నూతన కేంద్రాన్ని మంగళవారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు ప్రారంభించారు. ప్రత్యేక పూజలు నిర్వహించాక కొందరు భక్తులకు టికెట్లను జారీ చేశారు. అనంతరం చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ.. శ్రీవాణి టికెట్ల కోసం భక్తులు ఉదయం 5 గంటల నుంచే క్యూలైన్‌లో నిలబడుతున్నారని, ఈ నేపథ్యంలో భక్తులకు సులభతరంగా టికెట్లు జారీ చేసేందుకు రూ.60 లక్షలతో నూతన కౌంటర్లను నిర్మించామన్నారు. బుధవారం నుంచి ఈ కౌంటర్ల ద్వారా భక్తులకు టికెట్లు జారీ చేస్తామన్నారు. అనంతరం హెచ్‌వీసీ, ఏఎన్సీ ప్రాంతాల్లో ఆధునికీకరించిన ఉప విచారణ కార్యాలయాలను టీటీడీ చైర్మన్ ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో బోర్డు సభ్యులు సుచిత్ర ఎల్లా, జంగా కృష్ణమూర్తి, భానుప్రకాష్‌రెడ్డి, శాంతారామ్, నరేష్, సదాశివరావు, నర్సిరెడ్డి, జానకీదేవి, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యే లక్ష్యం

● టీచ్ ఫర్ చేంజ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ మంచు లక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న మంచు లక్ష్మి

నాయుడుపేట టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు టీచ్ ఫర్ చేంజ్ ఫౌండేషన్ కృషి చేస్తోందని ఫౌండేషన్ చైర్‌పర్సన్, సినీ నటి మంచులక్ష్మి పేర్కొన్నారు. నాయుడుపేట పట్టణం రాజగోపాలపురం ప్రభుత్వ పాఠశాలలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్ రూంను మంగళవారం మంచు లక్ష్మి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలన్న లక్ష్యంతో టీచ్ ఫర్ చేంజ్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో 320 డిజిటల్ క్లాస్ రూంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తమ అమ్మమ్మ ఊరైన నాయుడుపేట ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ రూంను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అంతకుముందు నాయుడుపేటలో ఉన్న తన తల్లి సమాధి వద్ద పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీవైఈవో సనత్‌కుమార్, ఎంఈవో మునిరత్నం, ప్రధానోపాధ్యాయుడు జనార్దనరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, మాజీ కౌన్సిలర్ శేషం మునిగోపి, టీడీపీ నాయకులు పెసల కిషోర్‌బాబు, నానాబాల సుబ్బారావు, అవధానం సుధీర్, సాయి, సురేష్, మస్తాన్, బాబు, తదితరులు పాల్గొన్నారు.



బోర్డు సమావేశంలో పాల్గొన్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, సభ్యులు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమలలోనూ
టీటీడీ పరిపాలన భవనం

● 142 మంది కాంట్రాక్ట్ డ్రైవర్ల క్రమబద్ధీకరణ ● బోర్డు నిర్ణయాలను వెల్లడించిన టీటీడీ చైర్మన్, ఈవో

తిరుమల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో కొత్తగా పరిపాలన భవనం నిర్మించాలని టీటీడీ నిర్ణయించింది. తిరుమలలో ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో ఉన్న వివిధ విభాగాలను ఒకే తావులోకి తీసుకురావడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్టు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మంగళవారం తెలిపారు. అలాగే ఏపీ హైకోర్టు తీర్పు మేరకు టీటీడీలో కాంట్రాక్ట్ డ్రైవర్లుగా పనిచేస్తున్న 142 మందిని క్రమబద్ధీకరించేందుకు తీర్మానం చేశామనీ, దీనిని ప్రభుత్వ ఆమోదం కోసం పంపుతామని చెప్పారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం జరిగిన ధర్మకర్తల మండలి సమావేశం వివరాలను ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులతో కలిసి చైర్మన్ మీడియాకు వివరించారు. బోర్డు నిర్ణయాల్లో కొన్ని ఇవీ..

- ఒంటిమిట్టలోని భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందించేందుకు రూ.4.35 కోట్లు కేటాయింపు.
- శ్రీవారిమెట్టు, అలిపిరి నడకమార్గాల్లో లైటింగ్, భద్రత పెంపు. ఆధ్యాత్మిక ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు.
- శిలాతోరణం, చక్రతీర్థం ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్, డీపీఆర్ రూపొందించాలని ఆదేశం.
- వివిధ దేశాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణానికి నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక పై టీటీడీ సబ్ కమిటీ ఏర్పాటు. ఆ కమిటీ నివేదిక ప్రకారం తదుపరి చర్యలు.
- శ్రీవారిసేవను మరింత పటిష్టంగా అమలుచేసేందుకు కాంట్రాక్టు విధానంలో 4 కోఆర్డినేటర్ పోస్టుల భర్తీ.
- కల్యాణకట్టల్లో మరింత మెరుగైన వసతుల కోసం నిపుణులను సంప్రదించి కార్యాచరణ ప్రణాళిక.
- తిరుమలలో పాతబడి హెచ్‌వీడీసీలోని ఆరు బ్లాకులు, బాలాజీ విశ్రాంతి భవనం, ఆంప్రో గెస్ట్‌హౌస్, అన్నపూర్ణ క్యాంటీన్, కల్యాణి సత్రాలను ఐఐటీ నిపుణుల సూచనల మేరకు తొలగించాలని నిర్ణయం.
- వేదపారాయణం స్కీం ద్వారా ఇప్పటికే 1,430 మందికి ఏటా రూ.36 కోట్ల గౌరవ వేతనం ఇస్తున్నారు. తాజాగా మరో 700 మందికీ ఇవ్వాలని నిర్ణయం. దీనివల్ల టీటీడీకి అదనంగా రూ.18 కోట్ల భారం పడుతుంది. రాష్ట్రంలోని వారికే తొలి ప్రాధాన్యం.
- కడపలోని పురాతనమైన శివాలయం అభివృద్ధి.
- తాళ్లపాకలో పలు అభివృద్ధి కార్యక్రమాలు.

ఆంజనేయుడికి
తొలగిన వాడిన మాల



తిరుమల మొదటి ఘాట్, అలిపిరి నడక మార్గంలోని ప్రసన్న ఆంజనేయస్వామికి ఉన్న వాడిన మాలను తొలగించారు. హనుమజ్జయంతి సందర్భంగా మే నెలలో ఆంజనేయస్వామికి వేసిన ఆకు, పూలమాలలు వాడిపోయినా తొలగించలేదు. దీనిపై 'మాల వాడిపోయింది గోవిందా' శీర్షికన ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన వార్తకు ఉన్నతాధికారులు వెంటనే స్పందించారు. వీరి ఆదేశాలతో వాడిపోయిన మాలలను తొలగించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

9 లక్షల ఉద్యోగాల కల్పనకు చర్యలు

● రూ.10 లక్షల కోట్లతో ఎంవోయూలు చేసుకున్నామన్న మంత్రి అనగాని



పండ్లు విక్రయిస్తున్న మహిళ సమస్యను తెలుసుకుంటున్న మంత్రి, ఎమ్మెల్యే

రేణిగుంట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వం రూ.పది లక్షల కోట్ల పెట్టుబడులతో 9 లక్షల ఉద్యోగాల కల్పనకు ఒప్పందాలు చేసుకున్నామని రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మంగళవారం సాయంత్రం రేణిగుంటలోని అంబేడ్కర్ కూడలిలో జరిగిన 'సుపరిపాలనకు తొలి అడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఏడాదిలో ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. యువతకు ఉపాధి కల్పించే దిశగా తమ ప్రభుత్వం అడుగులేస్తోందన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలన్న ప్రణాళికతో ఎమ్మెల్యే సుధీర్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చి తాగునీటి సమస్యను పరిష్కరించారని అభినందిస్తూ, ఇక్కడ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, మురుగునీటి కాలువలు కావాలని కోరారన్నారు. ఈ సమస్యలను మున్సిపల్ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పనులు పూర్తయ్యేలా చేస్తానని హామీ ఇచ్చారు. గత పాలనలో ప్రజలకు ఏమి చేయకుండానే కూటమి మేనిఫెస్టోపై బురద జల్లేలా వైసీపీ ప్రచారం చేస్తోందని విమర్శించారు. గత పాలనలోలాగా రౌడీయిజం, అరాచకాలు లేకపోవడంతో శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలు ప్రశాంతంగా నిద్రపోతున్నారని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ టీడీపీ అధ్యక్షులు ముని చంద్రారెడ్డి, మహబూబ్ బాషా, నేతలు సుబ్రహ్మణ్యం రెడ్డి, మునిస్వామి నాయుడు, నాదముని రెడ్డి, బుజ్జి నాయుడు, వెంకట మునిరెడ్డి, పుష్పనాదం, సుబ్రహ్మణ్యం, కన్నన్ రెడ్డి, రవి, రాజేష్ రెడ్డి, మేరీ, భాస్కర్ రెడ్డి, భాస్కర్ యాదవ్, నవాబ్, మురళి తదితరులు పాల్గొన్నారు.